తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

# ఆహార కల్తీని పసిగట్టే డార్ట్ పుస్తకం

**-మొబైల్ ప్రయోగశాలతో పరీక్షల ప్రదర్శన**



డార్ట్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి విద్య,అక్టోబర్ 16 ప్రభాతవార్త: తినే ఆహారం నాణ్యమైనదో.. కల్తీ జరిగిందో తెలుసుకోవడం వినియోగదారుల ఆరోగ్యానికి ఎంతో కీలకం. ఆహార పదార్థాల్లో కల్తీని వేగంగా గుర్తించే పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆహార భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంచే లక్ష్యంతో తిరుపతిలోని విశ్వం సైనిక్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా వరదరాజ నగర్‌లోని సంస్థ ఆడిటోరియంలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డార్ట్ (వేగవంతమైన పరీక్షల ద్వారా ఆహార కల్తీని గుర్తించడం) పుస్తకాన్ని ఆవిష్కరించారు. భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలోని ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ మొబైల్ ప్రయోగశాల ద్వారా ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించే విధానాలను వివరించారు. కల్తీని గుర్తించేందుకు చేపట్టే పరీక్షలు, ఆహార భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆహార భద్రతా అధికారి జగదీష్ మాట్లాడుతూ సురక్షితమైన, నాణ్యమైన ఆహారం పొందడం ప్రతి ఒక్కరి హక్కు అని తెలిపారు. ఆహార పదార్థాల్లో కల్తీకి పాల్పడటం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఏదైనా ఆహార పదార్థం నాణ్యతపై అనుమానం కలిగితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా వినియోగదారుల కౌన్సిల్ అధ్యక్షుడు పి.రాజారెడ్డి మాట్లాడుతూ జంక్‌ఫుడ్, అపరిశుభ్రమైన ఆహార పదార్థాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. విశ్వం విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక బాధ్యతలోనూ తమ సంస్థ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, ఆహార భద్రతా సిబ్బంది సుమన్, ప్రజాప్రగతి ట్రస్ట్‌కు చెందిన చెంచునారాయణ, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వీడని ఉత్కంఠత!

**టిడిపి అభ్యర్థిగా కఠారి హేమలత!**

**వైకాపా అభ్యర్థిగా రామస్వామి చంద్రశేఖర్ !**



ద్రాక్షాయణి కఠారి హేమలత సికె లావణ్య జ్ఞాన జగదీష్ రామస్వామి చంద్రశేఖర్

చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: నామినేషన్ల దాఖలు పర్వం ప్రారంభమైనప్పటికీ చిత్తూరు మున్సిపల్ మేయర్ అభ్యర్థుల ఎంపికపై ఇటు అధికార తెలుగుదేశం పార్టీ, అటు ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీల్లోను క్లారిటీ రావడం లేదు. చిత్తూరు మేయర్ స్థానం బిసి జనరల్‌కు రిజర్వ్ కావడంతో ఈ స్థానం నుండి మేయర్ అభ్యర్థులుగా పోటీ చేయడానికి తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీల నుండి పలువురు పోటీ పడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైనప్పటికీ ఇరు ప్రధాన పార్టీలు ఇప్పటికే మేయర్ అభ్యర్థులను ఖరారు చేయలేదు. తెలుగుదేశం దేశం తరపున మేయర్ అభ్యర్థిత్వంపై మొదటి నుండి కన్నేసిన జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాజూరు బాలాజీ గత రెండేళ్ళుగా చిత్తూరు నగర పరిధిలో తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ళడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు సైతం కాజూరు బాలాజీకి తెలుగుదేశం మేయర్ అభ్యర్థిత్వం ఇవ్వడానికి సుముఖత చూపడం తో ఇక తెలుగుదేశం మేయర్ అభ్యర్థి కాజూరు బాలాజీ వుంటారనే ప్రచారం జరిగింది. అయితే మేయర్ కుర్చీ బిసి జనరల్‌కు రిజర్వ్ కావడం కాజూరు బాలాజీ ఓసీ కావడంతో ఆమె సతీమణి ద్రాక్షాయణిని మేయర్ అభ్యర్థిత్వం తెరపై తీసుకువచ్చారు. తెలుగుదేశం మేయర్ అభ్యర్థిత్వం కోసం కాజూరు ద్రాక్షాయణి ప్రస్తుతం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే గత సార్వత్రిక ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే సికె బాబు కుటుంబానికి సైతం చిత్తూరు మేయర్ అభ్యర్థిత్వంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం హామీ ఇచ్చిందని, ఆ మేరకు మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు తెలుగుదేశం పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుతో కలిసి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు గుడిపాల మండలంలో పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే సికె బాబుకు చిత్తూరు నగర పరిధిలో బలమైన పట్టు వుండటం, పార్టీ అధిష్టానం సైతం సార్వత్రిక ఎన్నికల సమయంలో మేయర్ అభ్యర్థిత్వం కేటాయిస్తామని హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతుండటంతో ప్రస్తుతం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో సికె లావణ్యబాబు మేయర్ అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ప్రస్తుత చుడా ఛైర్‌పర్సన్, మాజీ మేయర్ కఠారి హేమలత మేయర్ కుర్చీ బిసి జనరల్‌కు రిజర్వ్ కావడంతో తనకు మరో సారి అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానంను కోరుతున్నారు. ఇక ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో మాజీ డిప్యుటీ మేయర్ ఆర్ చంద్రశేఖర్ మేయర్ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. చిత్తూరు నగర పరిధిలో క్రిమినల్ లాయర్‌గా ఆర్.చంద్రశేఖర్ ప్రసిద్ధి చెందడం, ఎన్నికల్లో ఖర్చు చేయడానికి ఆర్థికంగా బలంగా వుండటంతో పార్టీ అధిష్టానం సైతం ఈయనను మేయర్ ఎన్నికల బరిలో నిలపడానికి సుముఖంగా వున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బిసి నాయకులు జ్ఞాన జగదీష్ సైతం వైకాపా తరపున మేయర్ కుర్చీ బరిలో నిలవడానికి సిద్ధపడి తన వంతు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు.

అయితే శుక్రవారం రాత్రి అందిన సమాచారం మేరకు టిడిపి అభ్యర్థిగా కఠారి హేమలతను, వైకాపా తరపున మేయర్ అభ్యర్థిగా రామస్వామి చంద్రశేఖర్ పేర్ల అధిష్ఠానం ప్రకటించినట్లు పార్టీ నేతలు తెలిపారు

# గరుడునిపై...భక్తులను బ్రోచిన మలయప్ప

**-అశేష భక్తజనం నడుమ సాగిన గరుడ వాహనసేవ**



తిరుమల,అక్టోబర్16 ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరుని ఉత్సవమూర్తి మలయప్ప స్వామి శుక్రవారం రాత్రి తనకిష్టమైన గరుడునిపై విహరిస్తూ భక్తజనానికి దర్శనమిచ్చాడు. జోరువాన కురుస్తున్నా తనను శరణువేడిని భక్తులను కటాక్షించేందుకు ఘటోపాసానం మధ్య మలయప్ప విశేషాభరణాల అలంకృతుడై గరుడుని అధిరోహించి మాఢవీధుల్లో విహరించాడు. చల్లటి వాతావరణంలో కారుమబ్బులమధ్య విద్యుత్‌దీపాల వెలుగుల్లో వింజామరలు చల్లగా విసురుతుండగా భక్తుల గోవిందనామ్మరణల మధ్య అక్కడ నుండి మెల్లగా మలయప్పస్వామి భక్తకోటిని పలకరించాడు. ఆద్యంతం భక్తుల భక్తిపారవశ్యంతో గరుడునిపై కటాక్షించాడు. 108 వైష్ణవదివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను గోదాదేవి ప్రత్యేక పూలమాలలను, సహస్ర నామమాలను, చెన్నైనుండి తీసుకువచ్చిన అలంకృత ఛత్రాలు స్వామివారి గరుడవాహనసేవకు మరింత శోభను చేకూర్చాయి. ఈ వాహనసేవలో టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి ్మ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జానకీ దేవి, రంగశ్రీ, ఆనంద సాయి, దర్శన్, నరేష్ కుమార్, ఎన్. సదాశివరావు, జేఈఓలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్,సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అర్చకులు పాల్గొన్నారు.

# శ్రీ చెంగాళమ్మకు శ్రీ సరస్వతీ దేవి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త: శ్రీ చెంగాళమాత పరమేశ్వరి దేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి శుక్రవారం శ్రీ సరస్వతి దేవి అలంకారాన్ని చేసి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ప్రత్యేక అలంకారానికి నెల్లూరుకు చెందిన దువ్వూరు హరి ప్రసాద్ రెడ్డి, జ్యోతి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అలాగే దేవస్థాన ప్రాంగణంలోని యాగ మండపంలో చండీయాగాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరివిల్లు క్రియేషన్స్ నెల్లూరు వారిచే హాస్య వల్లరి, శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ నెల్లూరు వారిచే భరతనాట్యం, శ్రీ మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమీ నెల్లూరు వారిచే భరతనాట్యం ప్రదర్శనలు భక్తులను అలరించాయి. అలాగే అమ్మవారికి ఆనవాయితీగా సమర్పించే సారెలలో భాగంగా కస్వారెడ్డిపాలెం, దేగల పాలెం, సోనియా గాంధీనగర్, బాపూజీ కాలనీ నుంచి మేళ తాళాలతో బాణసంచా వేడుకలతో భక్తిశ్రద్ధలతో అమ్మణ్ణికి సారెలను సమర్పించారు దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బి ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

# ట్రాన్స్ పార్మర్ల దొంగల ముఠా అరెస్ట్

**-ఒక బైక్, 75కిలోల కాఫర్ వైర్ స్వాధీనం. 3 కేసుల్లో 33 ట్రాన్స్‌పార్మర్లు పగులగొట్టిన వైనం**



చిట్వేలి, అక్టోబర్ 16, ప్రభాతవార్త: చిట్వేలి మండలంతో పాటుగా రైల్వే కోడూరు పరిధిలో రాగి వైరు కోసం ట్రాన్స్ఫార్మర్లను బద్దలు చేస్తూ రైతులను హడలెత్తిస్తున్న అంతర్ ముఠా దొంగలను అరెస్టు చేసి 75 కిలోల కాపర్ వైర్ ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు రూరల్ సి ఐ. శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ,డిఎస్పీల ఆదేశానుశారం ట్రాన్స్ పార్మర్ల దొంగల విషయమై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని నాగవరం శివారు లోని చిట్వేలి రైల్వే కోడూరు ప్రధానరహదారిలో ఎస్ ఐ. సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి మోటార్ సైకిల్‌పై దోటి కర్ర పెట్టుకొని వెళ్తుండడాన్ని గమనించి వెనుకనే వెళ్ళి చూడగా నలుగురు వ్యక్తులు ట్రాన్స్ పార్మర్లను పగుల కొడుతుండగా దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. వీరిని విచారించగా ప్రస్తుతం చిట్వేలి మండల పరిధిలోని మల్లాలమ్మ ఎస్టీ కాలనిలో నివాసం ఉంటున్న పాముల వాసు, చీకోలు మల్లికార్జున, చీకోలు శంకర్, రైల్వే కోడూరు మండలం వి.వి కండ్రిక ఎస్టీ కాలనీ నివాసి మొలకల అశోక్ లను అదుపులోకి తీసుకోగా మడి చెరువు చరణ్ పారిపోయాడన్నారు. వారివద్దనుంచి ఏపీ 39 కే కే 9381 నంబరుగల హీరోహోండా మోటార్ బైక్, 75కిలోల కాపర్ వైర్ స్వాదినం చేసుకున్నామన్నారు. వీరు చిట్వేలి మండలంలో 4 కేసుల్లో 7, రైల్వేకోడూరు 4 కేసుల్లో 14,ఓబుల వారిపల్లి మండలంలో 3 కేసుల్లో 33,పుల్లంపేట మండలంలో 3 కేసుల్లో 33 ట్రాన్స్ పార్మర్లు మొత్తం 57 ట్రాన్స్ పార్మర్లను పగులగొట్టి రైతులను హడలెత్తించారన్నారు. పరారైనా వ్యక్తికోసం గాలిస్తున్నామని సిఐ. శ్రీనివాసులు తెలియజేశారు. ట్రాన్స్ పార్మర్ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రైతులను సిఐ శ్రీనివాసులు కోరారు. అనంతరం దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్ఐ వెంగయ్య,పిసి సుధాకర్, హోం గార్డులు శ్రీనివాసులు, మోహన్ రాజులకు రివార్డు బహుమతులు అందించి వారిని సీఐ అభినందించారు. ట్రాన్స్పార్మర్ల దొంగల కేసును ఎట్టకేలకు త్వరితగతిన చేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్సై వినోద్ కుమార్‌కు సిఐ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పుత్తూరు మునిసిపల్ ఎన్నికల్లో...

# అనూహ్య మార్పులు

**అమ్ములుకు పోటీగా... రంగంలోకి గంజి మాధవయ్య ?**



డి.ఎన్.ఏలుమలై (అమ్ములు)



గంజి మాధవయ్య

పుత్తూరు, అక్టోబరు 16 ప్రభాతవార్త : స్థానిక ఎన్నికల నేపథ్యంలో పుత్తూరు మునిసిపాలిటీ రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పట్టణ తెలుగుదేశం పార్టీలో తీవ్ర వ్యతిరేకత వున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపిలో చేరిన పుత్తూరు మాజీ సర్పంచ్, ఎంపిపి అయిన డి.ఎన్.ఏలుమలై (అమ్ములు)ను ఛైర్మన్ అభ్యర్థిగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ నిర్ణయించారు. నిన్న గాక మొన్న పార్టీలోకి వచ్చిన అమ్ములును ఛైర్మన్ అభ్యర్థిగా ప్రకటించడంపై పట్టణ పార్టీ క్యాడర్‌లో దాదాపు 50 శాతానికి పైగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అత్యధిక ఓట్లు వున్న సెంగుంద మొదలియార్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, అసెంబ్లీ ఎన్నికల ముందు ఛైర్మన్ పదవికి అవకాశం ఇస్తానని హామీ ఇవ్వడం వల్ల ఎమ్మెల్యే తీవ్ర వ్యతిరేకతలోనూ అమ్ములు అభ్యర్థిత్వం పట్ల స్థిర నిశ్చయంతో వున్నారు. ఊహించని విధంగా పుత్తూరు మునిసిపాలిటీ ఛైర్మన్ పదవిని జనసేనకు కేటాయించడంతో పార్టీ క్యాడర్‌లో కలకలం రేగింది. టిడిపి అభ్యర్థిగా అమ్ములు అభ్యర్థిత్వం డైలమాలో పడింది. మరో వైపు పుత్తూరు మాజీ ఎంపిపి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ గంజి మాధవయ్య తిరుపతి జడ్పీ ఛైర్మన్ పదవిని ఆశించి గత ఆరు నెలలుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను పలుమార్లు కలుస్తూ విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే తిరుపతి జడ్పీ ఛైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో గతంలో పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్ పదవిపై అనాసక్తి ప్రదర్శించిన ఆయన ప్రస్తుతం ఆసక్తి కనపరుస్తున్నారు. తన అనుయాయులు, శ్రేయోభిలాషులతో మంతనాలు సాగిస్తున్నారు. పట్టణ టిడిపిలో అమ్ములు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న కొందరు ముఖ్య నాయకులు లోపాయికారీగా గంజి మాధవయ్యకు మద్దతు పలుకుతున్నారు. ఛైర్మన్ పదవికి నామినేషన్ వేస్తే ఎన్నికల్లో ఆయన గెలుపునకు సహకరిస్తామని చెబుతున్నారు. దీంతో తాను ఛైర్మన్‌గా పోటీ చేస్తే గెలుస్తాననే నమ్మకానికి మాధవయ్య వచ్చారు. అయితే ఎమ్మెల్యేను కాదని...నామినేషన్ వేయడానికి సంకోచిస్తున్న మాధవయ్య, ఛైర్మన్‌గా పోటీ చేయడానికి తనకు అవకాశం కల్పించాలని స్వయంగా ఎమ్మెల్యేనే కోరుతున్నారు. అమ్ములు తప్ప మిగిలిన ఎవరైనా సరే...ఓటమి పాలయ్యే అవకాశాలున్నాయని, సెంగుంద మొదలియార్ సామాజిక వర్గం అమ్ములు అభ్యర్థిత్వం వైపై మొగ్గు చూపుతారనే భావనలో ఎమ్మెల్యే వున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకూ కూటమి పార్టీల తరపున ఛైర్మన్ అభ్యర్థిత్వం ఎవరికి దక్కుతుందనే అంశంపై పుత్తూరు పట్టణంలో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి.

# పార్టీ అధినేత నమ్మకం!

**-తిరుపతి టిడిపి మేయర్ అభ్యర్థిగా జేబి**

**- వైకాపా అభ్యర్థిగా వాసుదేవ యాదవ్!**

ఉత్కంఠత...ఎందరో ఆశావహులు తమతమ స్థాయిలో ప్రయత్నాలు చేసినా చివరకు తిరుపతి మేయర్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రస్తుత తిరుపతి ఇన్‌ఛార్జి జేబి శ్రీనివాస్(మన్నే శ్రీనివాస్ ప్రసాద్)కు అవకాశమిచ్చింది. అలాగే వైకాపా తిరుపతి మేయర్ అభ్యర్థిగా వాసుదేవ యాదవ్‌కు అవకాశం ఇచ్చారని పార్టీ వర్గాలు తెలిపాయి.



**తిరుపతి,అక్టోబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నియోజకవర్గ రాజకీయాల్లో ప్రజలతో మమేకమై పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న నాయకుడుగా జెబి శ్రీనివాస్‌కు పార్టీ ఎంతో నమ్మకంతో టిక్కెట్ ఇవ్వడం తిరుపతి నేతలకు కొంత ఊరటక లిగించింది. తొలి నుండి తిరుపతి మేయర్ టిక్కెట్‌పై దోబూచులాట ఆడుతూ వచ్చిన కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి చివరకు గురువారం రాత్రి తిరుపతి,చిత్తూరు మేయర్ టిక్కెట్లు టిడిపికే ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవడంతో ఒక్కసారిగా టిడిపి అధిష్ఠానం తన వ్యూహాన్ని మార్చినట్లు తెలుస్తోంది. ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో తిరుపతిలో వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిని ధీటుగా ఎదుర్కొనేందుకు జె.బి. శ్రీనివాస్ సరైన అభ్యర్థి అని పార్టీ నాయకత్వం భావించింది. ఇప్పటికే వైసిపి తరపున యాదవ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులను పరిశీలిస్తున్న సమాచారంతో అధికార టిడిపి కూడా అదే సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఒక్కసారిగా బలిజ సామాజిక వర్గానికి చెందిన జె.బి. శ్రీనివాస్, కోడూరు బాలసుబ్రమణ్యం, బట్టే కీర్తి, యాదవ సామాజిక వర్గానికి చెందిన నరసింహ యాదవ్, అన్నా అనితా యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్ పేర్లు పరిశీలనకు తీసుకుని ఐవిఆర్ఎస్ చేపట్టిందని పార్టీలో సీనియర్ నాయకుల వాదన. అయితే ఈ ప్రక్రియలో పలువురి పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ జె.బి. శ్రీనివాస్ అభ్యర్థిత్వం ఇప్పటికే ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో బలిజ సామాజిక వర్గానికి గణనీయమైన ఓటు బ్యాంకు ఉండటం, నియోజకవర్గ ఇన్‌చార్జిగా జె.బి. శ్రీనివాస్‌కు ఉన్న రాజకీయ పరిచయాలు, పట్టుకలిగి ఉండటం ఆయనకు అవకాశంగా మారింది. అదే సమయంలో భూమన కరుణాకర్ రెడ్డిని ఎదుర్కోగలరన్న అంచనాలు ఆయన అభ్యర్థిత్వానికి బలంగా మారినట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయినా జె.బి. శ్రీనివాస్ పేరుపై పార్టీ అధిష్ఠానం నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అధికారిక ప్రకటన అనంతరమే అభ్యర్థిత్వంపై స్పష్టత రానుంది. ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం చేసిన సేవలకు, నాయకత్వ లక్షణాలకు, సంస్థాగత నైపుణ్యానికి లభించిన గుర్తింపుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పుడు జరగనున్న నగరపాలకసంస్థ కౌన్సిల్ ఎన్నికల్లో 66 డివిజన్లకు కార్పొరేటర్లుగా యువత, పార్టీకి విశ్వాసపాత్రులైన నాయకులను ఎంపికచేసుకుని వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత కూడా జెబి శ్రీనివాస్‌పైనే ఉంది.

# క్రూ మాడ్యూల్ పరీక్ష విజయవంతం



గగన్‌యాన్ మిషన్ ప్రయోగంలో క్రూమాడ్యుల్

సూళ్లూరుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త: గగన్ యాన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇస్రో క్రూ మాడ్యుల్ సర్వీస్, సర్వీస్ మాడ్యూల్‌ను వేరు చేసే ప్రక్రియను శుక్రవారం తిరువునానంత పురంలోని విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రంలో విజయవంతంగా నిర్వహించారు. క్రూ మాడ్యూల్,సర్వీస్ మాడ్యూల్ ఉంటాయి. ఇవి ఒక వేరు చేసే వ్యవస్థను ఉపయోగించి అనుసంధానించబడి ఉంటాయి. క్రూమాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్ మధ్య విద్యుత్, ద్రవ సరఫరా అంబిలికల్ కనెక్షన్ ద్వారా నిర్ధారించబడుతుంది. ఈ మాడ్యూల్ ప్రయోగానికి ముందే ఏకీకృతం చేస్తారు. ప్రయోగం నుండి మిషన్ యొక్క కక్షలోని దశ పూర్తయ్యే వరకు ఇవి ఏకీకృత మాడ్యూల్‌గా పనిచేస్తాయి. భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించే ముందు క్రూ మాడ్యూల్, సర్వీస్‌ను వేరు చేయడంతో పైరో టెక్నిక్ పరికరాలు జస్టిసానింగ్ వ్యవస్థలను ఉపయోగించి ఖచ్చితమైన క్రమంలో అనేకసార్లు వేరు చేసే ప్రక్రియలు ఉంటాయి. విభజన వ్యవస్థ యొక్క మొత్తం రూపకల్పన సామర్థ్యాన్ని ధ్రువీకరించడానికి క్రూ మాడ్యూల్, సర్వీస్ మ్యాడ్యూల్ అసెంబ్లీనికి అనుకరించడానికి అంబిలికల్ కనెక్షన్‌ను పెంచడం ద్వారా జరిగే క్రూ మాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్ విభజన వ్యవస్థల రూపకల్పన సామర్థ్యాన్ని ధృవీకరించడమే కాకుండా ఈ పరీక్షలు క్రూమాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్‌లోని వివిధ కీలక ఉపవ్యవస్థల యొక్క పటిష్టతను అఘాతాన్ని తట్టుకునే విధంగా సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయి. వీటిలో వివిధ ఏవి వ్యవస్థలు, ఇనర్సియల్, నావిగేషన్ వ్యవస్థలు వెనుక భాగంలోని థర్మల్ ప్రొటెక్షన్ సిస్టం, కోనికల్ హీట్ షీల్డ్‌అలాగే క్రూ మాడ్యూల్‌లో డిస్ప్లాయబుల్, అంబిలకల్ షీల్డ్‌అలాగే క్రూ మాడ్యూల్ ఆఫ్ రైటింగ్ సిస్టం, థర్మల్ హ్యూమిడిటీ కంట్రోల్ సిస్టం యొక్క పైరో టెక్నిక్‌లు పనిచేస్తాయి. ఈ ప్రయోగం 2026వ సంవత్సరంలో ప్రయోగించిన మానవ రహిత గగన్ యాన్ మిషన్లక్ష్యంగా పెట్టుకొని ఈ ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు నిర్వహించి విజయం సాధించారు.

# కుప్పం మున్సిపల్ తెలుగు పార్టీ దేశం అభ్యర్థిగా రాజ్‌కుమార్



కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త: కుప్పం మునిసిపాలిటికి సంబంధించి తెలుగుదేశం పార్టీ తరుపున ఛైర్మన్ అభ్యర్థిగా రాజ్‌కుమార్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఖరారు చేశారు. 2014-19 మధ్య కాలంలో రాజ్ కుమార్ కుప్పం జడ్‌పిటిసిగా పనిచేశారు. ప్రస్తుతం కడ సభ్యుడుగా వున్నారు. వైకాపా హయాంలో మునిసిపల్ టిడిపి అధ్యక్షుడుగా పనిచేశారు. వైకాపా పాలనలో ఈయన కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది.

# ఎట్టకేలకు శ్రీకాళహస్తి...సీటు దక్కించుకున్న దేశం

**-తిరుగబడ్డ ద్వితీయశ్రేణి నాయకులు-చక్రం తిప్పిన కోలా**

శ్రీకాళహస్తి,అక్టోబర్ 15 ప్రభాతవార్త: ఎట్టకేలకు శ్రీకాళహస్తి మున్సిపాలిటి ఛైర్మెన్ కుర్చికి పోటీ చేయటానికి తెలుగుదేశం అవకాశం దక్కించుకుంది. శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచు కోటగా ఉండేది. అలాంటి నియోజకవర్గంలో కూటమిలో కష్టాలు ప్రారంభమయ్యాయి. కూటమిలో జనసేన, బిజెపిలు ఉండటంతో సర్దు బాటుల్లో ఇక్కడ జనసేన కోరుకుంటూ వస్తుంది. ఈ నేపథ్యంలో ఏడాదిక్రితం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ పదవి, సభ్యుల నియామకంలో తెలుగుదేశం పార్టీ ఛైర్మెన్ కుర్చిని జనసేనకు ఇవ్వక తప్పలేదు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో గురువారం కూటమి చర్చల్లో శ్రీకాళహస్తి ఛైర్మెన్ గురిపై జనసేన నాయకులు గురిపెట్టారు. దాంతో రాత్రి వరకు చర్చలు జరుగుతుండటంతో ఇక్కడ తెలుగుదేశం ద్వితీయశ్రేణి నాయకుల్లో ఉత్కంఠత చోటు చేసుకుంది. అయితే తెలుగుదేశం పార్టీకి ఛైర్మెన్‌గిరికి పోటీ చేయటానికి సంబంధించి అవకాశం కోసం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ చక్రం తిప్పారు. ఎట్టకేలకు అవకాశం తెలుగుదేశం దక్కించుకుంది. దాంతో పార్టీ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.

**ఉత్కంఠ భరితంగా చర్చలు:**

రాష్ట్రంలో జరిగే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కూటమిలోని మూడు పార్టీ మధ్య సీట్లు సర్దుబాటు ఆద్యంతం ఉత్కంఠత సృష్టించింది. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పోటీకి ఆది నుంచి తెలుగుదేశం ద్వితీయశ్రేణి నాయకులు ఉత్సాహంగా ఉండగా ఈ మున్సిపాలిటిని బిసి జనరల్ చేసారు. దాంతో తెలుగుదేశం పార్టీలో ఉత్కంఠత చోటు చేసుకుంది. ఆశావహులు స్థానిక శాసనసభ్యునిపై వత్తిడి తెస్తున్నారు. రెండు రోజులుగా కూటమి సర్దుబాటులో ఈ మున్సిపాలిటి జనసేనకు వస్తుందనే ప్రచారం జరిగింది. దాంతో తెలుగు దేశం పార్టీలో ఉత్కంఠత చోటు చేసుకుంది. నియోజకర్గ నాయకుడు ఎంపిటిసి, జడ్‌పిటిసి, పంచాయతీ ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో తలమునకలై ఉండగా మున్సిపాలిటి జనసేనకు అనే సంకేతాలు వచ్చాయి. దాంతో ఒక్కసారిగా ఉరందూరు గ్రామంలో ఉత్కంఠత చోటు చేసుకుంది. గతంలో శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి పగ్గాలు జనసేనకు అందించగా ప్రస్తుతం మున్సిపాలిటి కూడా జనసేనకే అని సంకేతాలు రావటంతో ఒక్కసారిగా స్థానిక ద్వితీయశ్రేణి నాయకులు ఒక్కసారిగా శాసనసభ్యునిపై వత్తిడి తెచ్చారు. ఒక దశలో తామంతా మూకుమ్మడి రాజీనామా చేస్తామంటూ మొండికేసారు, ఎంత సర్ది చెప్పినా అంగీకరించలేదు.

**పరిశీలకునికి ద్వితీయశ్రేణి నాయకుల మొర:**

శ్రీకాళహస్తిలో చోటు చేసుకున్న అసంతృప్తికి సంబంధించి పరిశీలకు మణి నాయుడుకు వివరించారు. శ్రీకాళహస్తి ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉందని అలాంటి చోట శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ పదవి జనసేనకు ఇచ్చారు. పట్టణంలో బిసిల సంఖ్య అధికంగా ఉందని ప్రస్తుతం మున్సిపల్ ఛైర్మెన్ కుర్చి కూడా ఇచ్చేస్తే ఎలా అని నిలదీశారు. దాంతో ఇక్కడ కార్యకర్తల మనోభావాలను శాసనసభ్యుడు మంత్రి లోకేష్‌కు వివరించినట్లు చర్చించుకుంటున్నారు. మీరు సంయమనం పాటిస్తూ ఎన్నికలు నిర్వహించండని శాంతపరచినట్లు దేశం వర్గాలు చర్చించుకుంటున్నాయి. అయితే ఈ అంశానికి సంబంధించి తెలుగుదేశం పార్టీకిమద్దతుగా బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్ రంగంలో దిగినట్లు సమాచారం ఆయన బిజెపి రాష్ట్ర నాయకులతో చర్చించినట్లు సమస్యను సర్దుబాటుకు సహకరించినట్లు దేశం వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఎట్టకేలకు శ్రీకాళహస్తి మున్సిపాలిటి జనసేన ఖాతాలో వెళ్ళకుండా కాపాడుకోగలిగారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య!



కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త: మండలంలోని గరిగచీని పల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకు న్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చక్రపాణి తెలిపారు. ఈసంఘటనకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ తెలిపిన మేరకు వివరాలిలా.. తమిళనాడు రాష్ట్రం పచ్చూరుకు చెందిన మంజునాథ్ కుప్పం మున్సిపల్ పరిధి తంబిగానిపల్లి గ్రామంలో స్థిరపడ్డాడు. ఇతను రైస్‌మిల్ నిర్వహించేవాడన్నారు. మంజునాథ్‌కు మండలంలోని గరిగచీనేపల్లి గ్రామంలో ఓ ప్రియురాలు ఉండేదన్నారు. అయితే ఇటీవలి కాలంలో ఆమె అతన్ని దూరం పెడుతున్న నేపథ్యంలో మంజునాథ్ గరిగచీనేపల్లి గ్రామానికి వెళ్లి ఆమె ఇంటి వద్దనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కాగా మంజునాథ్ కుటుంబీకులు అతని మృతిపైఅనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారన్నారు. మృతదేహాన్ని పంచనామాకు తరలించి అర్బన్ సిఐ జిటి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## గాజుల అలంకారంలో శ్రీ కన్యకాపరమేశ్వరి





రామకుప్పం, అక్టోబర్ 16 ప్రభాత వార్త: దసరా సందర్భంగా మండలంలోని ఆనిగానూరు, రామకుప్పంలో వెలసిన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు గాజులు, పత్తి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ, దీపారాధన చేపట్టారు.అధిక సంఖ్యలో పాల్గొన్నారు.నిర్వాహకులుఅన్నదానంజరిపారు.

## టువీలర్ అదుపు తప్పి వ్యక్తి మృతి!

**శాంతిపురం, అక్టోబర్ 16 ప్రభాతవార్త** :కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో మండలంలోని పోడూరు వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రాళ్లబూదుగూరు పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. తమిళనాడు రాష్ట్రం బరుగూరుకు చెందిన వినోద్, అరుణ్ (42)లు తమ సొంత పనుల నిమిత్తం కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు టువీలర్‌లో వచ్చి వెళ్తుండగా టువీలర్ అదుపు తప్పి పడడంతో వీరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో అరుణ్ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సొన్నేగానిపల్లి టిడిపి ఎంపిటిసి అభ్యర్థిగా ఉమాపతి



**శాంతిపురం, అక్టోబర్16 ప్రభాతవార్త:** మండలంలోని సొన్నేగానిపల్లి, ఎంకెపురం సెగ్మెంట్ తెదేపా ఎంపిటిసి అభ్యర్థిగా గుండిశెట్టిపల్లికి చెందిన ఉమాపతిని ఎన్నుకుంటూ పార్టీ నేతలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈసందర్భంగా ఉమాపతి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పిస్తున్న రెండు పంచాయతీల ప్రజలకు, తెదేపా కుటుంబ సభ్యులకు, సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## గుడుపల్లెలో ఎంపిపి...జడ్పీటిసిక్కై భారీ పోటీ

గుడుపల్లె, అక్టోబర్ 16 ప్రభాతవార్త: గుడుపల్లె మండలంలో ఎంపిపి, జడ్పీటిసి అభ్యర్థిత్వాలకే అధికార తెలుగుదేశం పార్టీలో నేతల మధ్య భారీ పోటీ నెలకొని ఉంది. ఎంపిపి స్థానం బిసి మహిళ, జడ్పీటిసి స్థానం జనరల్ మహిళకు రిజర్వు అయింది. దీంతో పార్టీలోని నేతలు తమ కుటుంబీకులకే సీటు దక్కాలని యత్నిస్తున్నారు. ఎంపిపి అభ్యర్థిత్వానికి పది మంది, జడ్పీటిసి అభ్యర్థిత్వంకు పదకొండు మంది రేసులో ఉన్నారు. వారిలో బాబునాయుడు, హేమాంబర గౌడు, వెంకటేష్, బేటప్ప నాయుడుతో పాటు ఇతర నేతలు కూడా తమ కుటుంబీకులకు ఎంపిపి, జడ్పీటిసి సీటు ఖరారుకై ప్రయత్నాలు చేస్తున్నారు.

## పరిషత్...పంచాయతీల్లో తప్పక గెలవాల్సిందే

- టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్



కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో త్వరలో జరగనున్న పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో తెదేపా ఘన విజయం సాధించేలా నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ కోరారు. శుక్రవారం మండలంలోని కొత్తిండ్లులో జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఎవర్ని అభ్యర్థిగా నిర్ణయిస్తే వారికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తప్పక మద్దతు పలకాలన్నారు. పార్టీకై కష్టపడిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, అధికార ప్రతినిధి పిసి సాంబశివం, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, కడ సభ్యుడు రామచంద్ర, కార్పోరేషన్ డైరెక్టర్ శరవణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ముక్కా కుటుంబం

**రైల్వే కోడూరు అర్బన్,అక్టోబర్ 16 ప్రభాతవార్త:** రైల్వే కోడూరు మండలం అమ్మవారిశాలలో కొలువై ఉన్న శ్రీశ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, రీగీదీతి చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, యువ నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

## దాడి పిరికి పందల చర్య: ధ్వజ రెడ్డి, సాయిలు



రైల్వే కోడూరు రూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త: శుక్రవారం తిరుపతి జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలో నామినేషన్లను వేసేందుకు తన అనుచరులతో వెళ్లిన రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీ అల్లరి మూకలు విచక్షణ రహితంగా మరణాయుధాలతో ఉన్నఫలంగా దాడులు చేయడం సమాజం తలదించుకునే చీకటి రోజు అని రైల్వే కోడూరు వైసిపి సీనియర్ నేతలు రామిరెడ్డి ధ్వజ రెడ్డి, తోట శివ సాయిలు అన్నారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ధ్వజరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలలో ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగి డిప్యూటీ ప్యానెల్ స్పీకర్ ఎదిగిన పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అన్ని వర్గాల వారు ఆదరిస్తారని అటువంటి వారిపై టిడిపి గూండాలు దాడి చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ దాడుల వెనుక టిడిపి పార్టీ ముఖ్య నేతలు ఇద్దరు ఉన్నారని వారికి ఇదే చివరి ఎన్నికలు అని వారు హితువు పలికారు. అయితే వైసీపీ ప్రభుత్వం వస్తే పరిస్థితులు తారుమారు అవుతాయని దాడి చేసిన వారు గుర్తించుకోవాలన్నారు.వైసీపీకి చెందిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి బిందె సేవ



రైల్వే కోడూరు అర్బన్, అక్టోబర్ 16 ప్రభాతవార్త: రైల్వేకోడూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు వీధిలో మూలా నక్షత్రం సందర్భంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి బిందె సేవ (కలశసేవ) కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, యువజన సంఘం సభ్యులు, మహిళా మండలి సభ్యులు మరియు భక్తులు పాల్గొనడం జరిగిందని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్ తెలిపారు.

## పార్టీలో నిష్పక్షపాతంగా పనిచేసిన వారికే పదవులు



రైల్వే కోడూరు రూరల్,అక్టోబర్ 16 ప్రభాతవార్త: రైల్వే కోడూరు నియోజకవర్గంలో నిష్పక్షపాతంగా పార్టీకి పనిచేసిన వారికే పదవులు దక్కుతా యని ఇది పార్టీ కేంద్ర కార్యాలయ సిద్ధాంతం అని రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపా నంద రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కార్యకర్తల ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతోనూ, అభిమానులతోనూ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తు నాయకులు ఐటి మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు పార్టీలో మొదటి నుంచి పనిచేసిన వారికి ప్రాధాన్యతను ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలలో శాంతి, లా అండ్ ఆర్డర్ అదుపులోకి వచ్చాయని ఇదే విధానాన్ని కొనసాగించి నియోజకవర్గం లోని ఐదు మండలాలలో కూటమి విజయ దంకా మోగించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, నారా లోకేష్‌కు అంకితం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్ గౌడ్, సురపరాజు పల్లె మాజీ సర్పంచ్ సుబ్బరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగారాజు రవి కుమార్ రాజు, పందేటి వెంకట్రామరాజు, సుదర్శన్ రాజు, ఆకే పాటి సుకుమార్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ పఠాన్ మోలా, పోకలమని తోపాటు టిడిపికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ పదవులకు 3 నామినేషన్లు

- కార్పొరేటర్లు, కౌన్సిలర్ స్థానాలకు 36 నామినేషన్లు
- చిత్తూరు మేయర్ పదవికి మొదటి రోజు నామినేషన్లు నిల్

చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ చైర్మన్ పదవులకు నామినేషన్ల దాఖలుకు మొదటి రోజైన శుక్రవారం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. చిత్తూరు మేయర్ పదవికి మొదటి రోజు ఎవరు నామినేషన్లు దాఖలు చేయలేదు. అలాగే జిల్లాలోని మున్సిపల్ డివిజన్లు, వార్డులకు మొదటి రోజు 36 నామినేషన్లు దాఖలు అయ్యాయి. కుప్పం మున్సిపల్ చైర్మన్ పదవికి మొదటి రోజు ఇద్దరు అభ్యర్థులు తెలుగుదేశం పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే కుప్పం మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 32 వార్డులు వుండగా మొదటి రోజు వార్డు స్థానాలకు 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అలాగే నగరి మున్సిపల్ చైర్మన్ పదవికి తెలుగుదేశం పార్టీ తరపున ఒక నామినేషన్ దాఖలు అయ్యింది. అలాగే నగరి మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 40 వార్డులు వుండగా మొదటి రోజు తెలుగుదేశం పార్టీ తరపున కౌన్సిలర్ స్థానాలకు ఏడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవికి మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాకపోగా, 60 కార్పొరేటర్ల స్థానాలకు సంబంధించి మొదటి రోజు 15 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే పలమనేరు మున్సిపల్ చైర్మన్ పదవికి మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. అలాగే పలమనేరు మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 36 వార్డులు వుండగా అందులో మొదటి రోజు అభ్యర్థులు మూడు నామినేషన్లు దాఖలు చేశారు.

## మహాలక్ష్మీగా ముత్యాలమ్మ



బంగారుపాళ్యం, అక్టోబర్ 16 ప్రభాతవార్త: నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాలక్ష్మీగా ముత్యాలమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు మురళీ స్వామి, కార్తీక్ స్వాములు మూల విరాట్ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవమూర్తిని శ్రీమహాలక్ష్మీగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా భవానీ నాగేంద్ర, రాంబాబు, సురేంద్ర, శివకుమార్, చిట్టిబాబు, ప్రభాకర్, సాంబశివలు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఎంబి కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## మొగిలీశ్వరాలయంలో సహస్ర కలశాభిషేకం



బంగారుపాళ్యం, అక్టోబర్ 16 **ప్రభాతవార్త:** నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వయంభూ శ్రీ మొగిలీశ్వరాలయంలో సహస్ర కలశాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మూల విరాట్ స్వామి అమ్మ వార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని దుర్గాదేవి అమ్మవారికి సహస్ర కలశాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. మొగిలి, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఈ కలశాభిషేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గణేష్ పూజ, సప్త వాచక, కలశ స్థాపన, దుర్గా లక్ష్మీ సరస్వతి ఆరాధనా పూజా కార్యక్రమంను ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలనాథరెడ్డి, టిడిపి నాయకులు ఎన్‌పి జయప్రకాష్, జనార్ధన్‌గౌడ్, ఎన్‌పి ధరణి, జయచంద్రనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం దుంగలు పట్టివేత



బంగారుపాళ్యం, అక్టోబర్ 16 ప్రభాతవార్త: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి ఇందిరానగర్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజాము ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. చిత్తూరు వైపు నుండి పలమనేరు వైపు ఒక బొలోరో వాహనంలో 30 ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న విషయంను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గుర్తించారు. ఆ వాహనంను వెంబడించగా ఆ వాహనం ఇందిరా నగర్ వద్ద మలుపు వద్ద తిరిగి చిత్తూరు వైపు వెళ్ళడం ప్రారంభించింది. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మళ్ళీ ఆ వాహనంను వెంబడించగా ముందు వెళ్తున్న బొలోరో వాహనం అతివేగంగా వెళ్ళి బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తులు వాహనం వదలి పారిపోయారు. ఆ వాహనంలో వున్న 30 ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎర్రచందనంతో పాటు వాహనంను సైతం తిరుపతికి తరలించారు. ఈ విషయంను స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.

## అన్నపూర్ణాదేవి అలంకారంలో మరగదాంభిగా

కాణిపాకం,అక్టోబర్ 16 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం మరగదాంభిగా అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలను సమర్పించి విశేష సమర్పణ గావించారు. అలాగే అమ్మవారి ఉత్సవమూర్తిని మండపంలో వుంచి శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొకుకలు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే



కాణిపాకం, అక్టోబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయంలో రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.

## కుప్పం మున్సిపల్‌లో తొలిరోజే నామినేషన్ల బోణీ

- అధికార తెదేపా తరపునే అందిన నామినేషన్లు
- చైర్మన్‌కు రాజ్‌కుమార్..డాక్టర్ వెంకటేష్.. కౌన్సిలర్లకు 11మంది





కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త: పురపాలక సంఘం ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఉదయం 11గంటలనుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలోని నామినేషన్ దాఖలు కౌంటర్లలో నామినేషన్లను అధికారులు స్వీకరించారు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటల అనంతరం నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజే అధికార తెలుగుదేశం పార్టీ తరపున చైర్మన్ అభ్యర్థికి 2, వార్డు కౌన్సిలర్ల స్థానాలకు 11 నామినేషన్లు దాఖలయ్యాయి.తెదేపా తరపున చైర్మన్ అభ్యర్థిత్వం ఆశిస్తున్న ఎస్. రాజ్‌కుమార్, డాక్టర్ వెంకటేష్ ప్రతిపాదకులతో వచ్చి తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి శ్రీనివాసులురాజుకు అందజేశారు. అలాగే తెదేపా తరపున కౌన్సిలర్ సీటుకుగాను6వ వార్డుకు శింగారవేలు, 7వ వార్డుకు నందగోపాల్, 8వ వార్డుకు చందుకిరణ్, 9వ వార్డుకు వెంకటాచలం, 11 వార్డుకు కళ, 13వ వార్డుకు నాగభూషణం, 22వ వార్డుకు అశ్విని, 25వ వార్డుకు బికె దామోదరం, 28వ వార్డుకు భారతి, 29వవార్డుకు విజయలక్ష్మితో పాటు మరో వార్డుకు తమ నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. అభ్యర్థితో పాటు ప్రతిపాదకులను మాత్రమే పోలీసు అధికారులు నామినేషన్ దాఖలుకు అనుమతించారు. ఎస్పీ బి.హేమంత్ ఆదేశాలతో అర్బన్, రూరల్ సిఐలు జి.టి.నాయుడు, మల్లేష్ యాదవ్ నామినేషన్ల కేంద్రం వద్ద గట్టి బందోబస్తు చేపట్టారు. నేడు, రేపు నామినేషన్ల దాఖలు అధిక సంఖ్యలో అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## ఎఎస్పీ నేతృత్వంలో గట్టి భద్రత ఏర్పాట్లు



కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త: కుప్పం మున్సిపాలిటీ ఎన్నికలకు నామినేషన్ల సందర్భంగా కుప్పం ఎఎస్పీ బి.హేమంత్ పట్టణంలో గట్టి భద్రత ఏర్పాట్లను చేపట్టారు. నామినేషన్ కేంద్రం అయిన మున్సిపల్ కార్యాలయం రోడ్డులో వన్‌వే ట్రాఫిక్‌ను అమలు చేశారు. అలాగే నామినేషన్ కేంద్రం వద్ద ఎఎస్పీ స్వయంగా భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించి పోలీసు అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఇద్దరు సిఐలతో పాటు ఎస్సైలు, పోలీసు సిబ్బందితో పటిష్టంగా నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయించారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థితో పాటు ప్రతిపాదకుడిని మాత్రమే లోపలికి పంపాలని అలాగే నామినేషన్ కేంద్రంకు వెళ్లే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపాలని ఆదేశించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ఏ టికెట్ ఇచ్చిన అఖండ మెజారిటీ సాధించి చూపెడతా



**పూతలపట్టు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** మండలంలోని వావిల్ తోట పంచాయతీలో లక్ష్మయ్య ఊరుకు చెందిన గంగారపు గోపి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహిస్తూ గడచిన 2019 - 2024 తెలుగుదేశం పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ వారికి కష్టంలో వెన్నుదన్నుగా ఉండి పార్టీ కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపి పూతలపట్టు మండలంలో తెలుగుదేశం పార్టీ జెండాని రెపరెపలాడించిన నాయకుడు గంగారపు గోపి. ఆయన చేస్తున్న సామాజిక కార్యకలాపాలు కష్టం వస్తే పిలిస్తే పలికే నాయకుడు గోపి. పూతలపట్టు మండలంలోనే కాదు నియోజకవర్గంలోనే తెలుగుదేశం పార్టీ నాయకులలో ఉత్సాహవంతంగా పార్టీకి, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటూ ఎన్నో సేవలు చేస్తున్నారు ఇప్పుడు స్థానిక ఎన్నికలు నేపథ్యంలో పూతలపట్టు ఎంపీపీ, జడ్పిటిసి అండ్ రిజర్వుడ్ కావడంతో పూతలపట్టు మండలంలోని కార్యకర్తలు, నాయకులు గంగారపు గోపికి ఏ టికెట్ ఇచ్చిన ఎవరు ఊహించని విధంగా అఖండ మెజారిటీతో గెలిపించుకుని తెలుగుదేశం పార్టీ జెండాని రెపరెపలాడిస్తామని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు అండగా నిలవడం యువతకు ప్రోత్సాహం అందించడం గ్రామ అభివృద్ధికి కృషి చేయడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మండల ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బాధ్యతాయుతంగా ఎన్నికల విధులు : జడ్పీ సిఇఓ



**చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు అన్నారు. జడ్పీ సమావేశభవనంలో శుక్రవారం జడ్పీటిసీ, ఎంపిటిసీ ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరైన జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ నిర్దేశించిన గడువులోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాల్సివుండటంతో ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులు, బాధ్యతలను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం జడ్పీటిసీ, ఎంపిటిసీ ఎన్నికలు ఆపై గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, ఎన్నికల విధుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఆర్ఓ హ్యాండ్‌బుక్‌లో వున్న ప్రతి అంశంను క్షుణ్ణంగా అవగాహన కలిగి వుండాలని, ఎన్నికల సమయంలో సొంత నిర్ణయాలు తీసుకోరాదని, ఆర్ఓ, ఏఆర్ఓ విధులు కేటాయించబడిన వారు ముందుగా వారికి కేటాయించబడిన డివిజన్లలో ఓటర్ల నమోదు, ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు, పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అవసరమైన మౌళిక సదుపాయాలను పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. డిఎల్‌డిఓ రవికుమార్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులునాయుడు, డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి, డ్వామా పిడి రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, రిటర్నింగ్ అదికారులు, సహాయక రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ గడువు పెంపు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి క్లైములు, అభ్యంతరాల పరిష్కారానికి గడువు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 1 జులై 2026వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్టోబర్ 22 వరకు క్లైములు, అభ్యంతరాల పరిష్కారానికి అవకాశం కల్పించినట్లు వివరించారు. ఎన్నికల సంఘం ఈ నెల 14వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నోటీసుల ప్రక్రియ కూడా అప్పటి వరకు కొనసాగుతుందన్నారు. అక్టోబర్ 30వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఏదైనా తప్పులు, అభ్యంతరాలు వుంటే నిర్ణీత గడువులోపు సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించు కోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీలకు సైతం సవరించిన షెడ్యూల్‌ను లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు.

## చిత్తూరులో ప్రారంభమైన నామినేషన్ల హడావుడి

- మొదటి రోజు మేయర్ స్థానానికి నిల్, డివిజన్లకు 15 నామినేషన్లు దాఖలు

**చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు ఘట్టం ప్రారంభమైంది. చిత్తూరు మేయర్ స్థానానికి మొదటి రోజు ఎవ్వరు నామినేషన్లు దాఖలు చేయలేదు. అయితే మున్సిపల్ డివిజన్లకు సంబంధించి మొదటి రోజు 60 డివిజన్ల పరిధిలో 15 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ తరపున 5 నామినేషన్లు దాఖలు కాగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున 9 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జనసేన పార్టీ నుండి ఒక అభ్యర్థి కార్పొరేటర్‌గా పోటీ చేయడానికి నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థుల నుండి నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు స్వీకరించారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలకు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు సమయం వుందని, ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు నిర్ణీత గడువులోపు నామినేషన్లు దాఖలు చేయాలని అదనపు ఎన్నికల అధికారి, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ తెలిపారు.

## నామినేషన్ల దాఖలుకు పక్కా పోలీసు బందోబస్తు



**చిత్తూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ సజావుగా సాగడానికి పోలీసు శాఖ పక్కా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసింది. చిత్తూరు సబ్ డివిజన్ పరిధిలో అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్‌భాషా, నగరి సబ్ డివిజన్ పరిధిలో ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్.షానులు అభ్యర్థుల నామినేషన్ దాఖలు ప్రక్రియను పరిశీలించి పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం నామినేషన్ స్వీకరణ కేంద్రాల పరిధిలో పోలీసు బందోబస్తును అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్‌భాషా పర్యవేక్షించారు. అలాగే నగరి మున్సిపాల్టీ పరిధిలో నామినేషన్ కేంద్రాల వద్ద ఆపరేషన్స్ ఎఎస్పీ షాను పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎఎస్పీలు మహబూబ్‌భాషా, షానులు మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది విధులకు అప్రమత్తంగా నిర్వర్తించాలని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు వుండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల బందోబస్తును మరింత పటిష్టం చేయడంలో భాగంగా నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని పరిస్థితులను పర్యవేక్షించడానికి డ్రోన్లను వినియోగిస్తున్నామన్నారు. డ్రోన్ల ద్వారా పరిసర ప్రాంతాలు పరిశీలిస్తూ జనసమూహాల కదలికు, రద్దీ ప్రాంతాలు, శాంతిభద్రతలకు సంబంధించిన పరిస్థితులపై నిఘా వుంచుతున్నామన్నారు.

## వైద్య విద్యకు అనాటమి పునాది

- అపోలో యూనివర్సిటీలో ఘనంగా ప్రపంచ అనాటమి దినోత్సవం



చిత్తూరుహెల్త్, అక్టోబర్ 16 ప్రభాతవార్త: వైద్య విద్యలో అనాటమీ(శరీర నిర్మాణ శాస్త్రం) అత్యంత కీలకమని, సమర్థవంతమైన వైద్యుడిగా ఎదగడానికి ఇది ప్రాథమిక పునాది అని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(ఎఐఎంఎస్ఆర్) డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ అన్నారు. అపోలో యూనివర్సిటీలో శుక్రవారం ప్రపంచ అనాటమీ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ 'తరగతి గదిని దాటి అనాటమీ-క్లినికల్ వైద్యంలో దాని పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. శరీర నిర్మాణ శాస్త్రంపై అవగాహన వైద్య విద్యలోనే కాకుండా, రోగుల ఆరోగ్య సమస్యలను అర్థం చేసుకోవడం, వైద్య పరీక్షలను విశ్లేషించడం, వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరిజ్ఞానంను పెంపొందించు కోవడంలోను కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు ప్రాథమిక వైద్య శాస్త్ర అంశాలను శ్రద్ధగా అభ్యసిస్తూ వాటిని క్లినికల్ వైద్యంతో అనుసంధానించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి జి 'వైద్య విద్యలో అనాటమీ ప్రాధాన్యం-డాక్టర్‌గా ఎదిగేందుకు తొలి అడుగు' అంశంపై వివరించారు. ఈ కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ థెరెసా రాణి, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ ప్రియానంద్ పి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సవిత ఎస్, ఇతర అధ్యాపకులు, 2026 ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతరిక్ష వారోత్సవాల ముగింపు వేడుకలు



సూళ్లూరుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త : శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవం-2026 ముగింపు వేడుకలు శుక్రవారం శ్రీహరికోటలోని బ్రహ్మ ప్రకాష్ హాల్లో ఘనంగా నిర్వహించబడ్డాయి. 'రాకెట్ విప్లవం' అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సీఈఓ వెంకటేశ్వర్లు కేసినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. షార్ డైరెక్టర్ ఎస్. ముత్తుచెళియన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారోత్సవాల నివేదికను సమర్పించడంతో పాటు, అంతరిక్ష పరిశోధనల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేసి, ముఖ్య అతిథిని సత్కరించారు. వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువతలో అంతరిక్ష విజ్ఞానంపై అవగాహనను పెంపొందించడమే కాకుండా, శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల ఆసక్తిని ప్రోత్సహించారు. ఈ ముగింపు వేడుకలు అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశం సాధిస్తున్న ప్రగతిని చాటిచెప్పడంతో పాటు, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల షార్ చైర్మన్ ఏ. బాల మురళి, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ శంకరన్, షార్ కంట్రోలర్ వై. శ్రీనివాసరావు, అసోసియేట్ డైరెక్టర్ జి .రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి రోజు నామినేషన్లు నిల్

సూళ్లూరుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త: మున్సిపాలిటీ ఎన్నికల సంబంధించి మొదటి రోజున చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్‌కు సంబంధించి ఎటువంటి నామినేషన్లు నమోదు కాలేదు. శుక్రవారం ఆరు కేంద్రాలలో నామినేషన్ ప్రక్రియను చేపట్టారు. నామినేషన్ల వేసే కార్యక్రమం జరిగినప్పటికీ నామినేషన్లు వేసే అభ్యర్థులు తమకు కావలసిన క్లియరెన్స్ సర్టిఫికెట్స్ కోసం మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవడంతో కార్యాలయం మొత్తం సందడి సందడిగా మారింది.రానున్న రెండు రోజుల్లో నామినేషన్లు వేసే ప్రక్రియ ఊపొందుకునే అవకాశాలు ఉన్నాయి. సీఐ ఎం మురళీకృష్ణ పర్యవేక్షణలో ఎస్సైలు జి అజయ్ కుమార్, జీవి చౌదరి, కొండప నాయుడు, సుబ్రమణ్య రాజు, భాను ప్రసన్న తదితరులు తమ సిబ్బందితో కలిసి నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

## వైసీపీలో అందరికీ సముచిత స్థానం ఉంటుంది

**- నియోజకవర్గ సమన్వయకర్త రామ్ కుమార్‌రెడ్డి**



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి లోని ఎన్‌జేఆర్ భవనంలో జనసేన పార్టీలో చేరారు. జనసేన నేత వెంకటేశ్వర్లు రాంకు మార్‌రెడ్డి వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వెంకటేశ్వర్లతో పాటు పలువురు జనసేన నాయకులు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని పార్టీలో చేరిన వారికి చెప్పారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి యొక్క నాయకత్వ లక్షణాలు పనితీరును చూసి వైసిపిలో చేరినట్లు వెంకటేశ్వర్లు ప్రకటించారు. జనసేన పార్టీలో ఎంత పని చేసిన గుర్తింపు లేకుండా పోతుందని ఆయన ఈ సందర్భంగా వాపోయారు. వెంకటేశ్వర్ల తో పాటు 20 మంది వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు కోడూరు కల్పలత రెడ్డి, వైసిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మొదటి రోజు నామినేషన్లు నిల్



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త : మున్సిపాలిటీలో మొదటి రోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మున్సిపల్ కార్యాలయంలో 36 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 36 వార్డులు, చైర్ పర్సన్ కు నామినేషన్లు వేయలేదని కమిషనర్ కిరణ్ తెలిపారు. మొదటి రోజు అష్టమి కావడంతో నామినేషన్ వేయలేదని తెలిసింది. శనివారం తిథి బాగుండడంతో నామినేషన్లు భారీగా దాఖలు అవుతాయి. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎవరిని అనుమతించడం లేదు. పోలీసులు ముందుగానే అందర్ని నిలిపివేస్తున్నారు. నామినేషన్లు వేశారు అభ్యర్థితో పాటు బలపరిచే వారు మాత్రమే వెళ్లాలని నిబంధనలు పెట్టారు.

## టిడిపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిపై... వీడని ఉత్కంఠ



వెంకటగిరి, అక్టోబర్ 16, ప్రభాతవార్త తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ వీడలేదు. తెలుగుదేశం పార్టీ టికెట్టు నలుగురు ఆశిస్తున్నారు. నలుగురు అభ్యర్థుల్లో ఎవరు దీటైన వారిని ఐవిఆర్ కాల్స్ ద్వారా పార్టీ అధిష్టానం సర్వే చేపట్టింది. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతు శారద, ఇంజ నీరింగ్ చదివిన పులికల్లు పూజిత, డాక్టర్ పును గోటి నిషమా, ప్రముఖ వస్త్ర వ్యాపారి సామల చలపతి సతీమణి సామల లక్ష్మీదేవి టికెట్ కోసం ఆశిస్తున్నారు. ఈ నలుగురు పేర్లను అధిష్టానానికి ఎమ్మెల్యే కార్యాలయం నుండి పంపినట్లు తెలిసింది. నామినేషన్ వేసేందుకు రెండు రోజులే గడువు ఉన్నప్పటికి ఇంకా అభ్యర్థి ఎంపిక జరగకపోవడంతో అందరిలో ఉత్కంఠ నెలకొని ఉంది. జనరల్ మహిళకు వెంకటగిరి మున్సిపల్ పీఠం కేటాయించారు. వైసిపి అభ్యర్థి ప్రముఖ న్యాచురల్ పార్టీ వైద్యులు డాక్టర్ మస్తాన్ యాదవ్ సతీమణి దివ్య పేరును ఖరారు చేసినట్లు తెలిసింది. వైసిపి అభ్యర్థిని శనివారం నామినేషన్ వేయనున్నారు.

## మిథున్ రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా : ఎంపీ



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: పుంగనూరులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. పుంగనూరు మున్సిపాలిటీకి నామినేషన్ల సందర్భంగా తన పార్టీ అభ్యర్థులతో కలిసి ఎంపీ మిథున్‌రెడ్డి వెళ్లగా ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి పార్టీ చెందిన వ్యక్తుల దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడుతున్న తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారిందని అన్నారు. ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు జరగే ప్రమాదం ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుగానే రాష్ట్ర ఎన్నికల సంఘానికి, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ దాడులు చోటుచేసుకోవడం ప్రభుత్వ శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నాయకుడు, ఎంపీ పివి మిథున్‌రెడ్డిపై పుంగనూరులో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డిపై దాడి, రాయచోటిలో పార్టీ కార్యాలయానికి నిప్పంటించడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు రాష్ట్రంలో నెలకొన్న అరాచకాలకు నిదర్శనమని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కోవాల్సిన అధికార పక్షం, దాడులు, దౌర్జన్యాల ద్వారా ప్రతిపక్షాన్ని భయభ్రాంతులకు గురిచేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో హింసకు, రాజకీయ కక్షసాధింపులకు తావులేదని, రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలనను పరిరక్షించేందుకు సంబంధిత వ్యవస్థలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## శ్రీ పార్వతీ దేవికి శ్రీ సరస్వతి దేవి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల భాగంగా శుక్రవారం అమ్మవారికి శ్రీ సరస్వతి దేవి అలంకారాన్ని చేశారు. ప్రత్యేక అలంకారానికి జి అజయ్ కుమార్, మాధురి దంపతులు ఉపయకర్తలుగా వ్యవహరించారు. అలాగే సాయంత్రం కుంకుమార్చన పూజలను నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, అర్చకులు పేటేటి సునీల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## మున్సిపల్ చైర్పర్సన్ వైసీపీ అభ్యర్థినిగా దివ్య!



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: మున్సిపల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినిగా బొలిగల దివ్యను ఎంపిక చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన ఆమెను వైయస్సార్సీపి మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు పార్టీ అధికారంగా ప్రకటించింది. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లె రామ్‌కుమార్‌రెడ్డి చైర్పర్సన్ అభ్యర్థిగా ఆమెను ఎంపిక చేశారు. ప్రముఖ న్యాచురల్ పతి వైద్యులు డాక్టర్ మస్తాన్ యాదవ్ సతీమణి దివ్య. దివ్య భర్తతో పాటు వెంకటగిరి పట్టణంలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం ఆమె నామినేషన్ వేయనున్నారు.

## బైక్ ఆటో ఢీతో వాటంబేడుకు చెందిన వ్యక్తి మృతి

తడ, అక్టోబర్ 16 ప్రభాతవార్త: తడ మండలం వాటంబేడు సమీపంలో బైక్ ఆటో ఢీకొట్టడంతో బైక్ పై ప్రయాణిస్తున్న వాటంబేడు కుప్పానికి చెందిన శశి కుమార్ మృతి చెందాడు. వాటంబేడు నుండి సూళ్లూరుపేట వైపు వెళుతుండగా పాముల మిట్ట సమీపంలో ఆటోను బైక్ ఢీకొట్టడంతో బైక్ వెనుకాల కూర్చొని ఉన్న శశికుమార్‌కు తీవ్ర గాయాలు తీవ్ర రక్తస్రావంలో అక్కడికక్కడే మృతి చెందాడు బైక్ నడుపుతున్న మరో వ్యక్తికి హెల్మెంట్ ఉండడంతో గాయాలతో ప్రాణాపాయం తప్పింది శశికుమార్ మృతితో వాటంబేడు కుప్పం నందు విషాదఛాయలు అలుముకున్నాయి.

## కూటమి అభ్యర్థుల విజయంలో...కీలక పాత్ర పోషించాలి



తడ,అక్టోబర్ 16 ప్రభాతవార్త: రానున్న స్థానిక ఎన్నికల సమరానికి భారతీయ జనతా పార్టీ శ్రేణులు సిద్ధంకావాలని తడ మండలం బిజెపి అధ్యక్షులు చిల్లకూరు తేజరెడ్డి బిజెపి నాయకులు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంలో బిజెపి శ్రేణులు కీలక పాత్ర పోషించాలని భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించి గ్రామస్థాయి నుండి బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించాలని తడ మండలంలో అధిక స్థానాలలో అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని తేజా రెడ్డి బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ఎన్నికల్లో కూటమి నాయకులు అరాచకాలు తగదు

**- వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త రామ్ కుమార్ రెడ్డి**



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభావవార్త : కూటమి నాయకులు స్థానిక సంస్థ ఎన్నికల్లో అరాచకాలు సృష్టిస్తున్నారని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి లోని ఎన్‌జేఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి చేసి వాహనాలు ధ్వంసం చేశారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కూడా మా అభ్యర్థి దివ్య, 36 వార్డుల్లో అభ్యర్థులు గెలిపించుకొని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇస్తామని చెప్పారు. దివ్య వెంకటగిరి అభివృద్ధి చేయాలని రాజకీయాలకు వచ్చినట్లు చెప్పారు. సమావేశంలో వైసిపి ఈసీ సభ్యులు బొలిగాల మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలుసుకొని మహిళలకు చైర్పర్సన్ నో కేటాయించాలని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఘనవిజయం సాధిస్తుందని తెలిపారు. తన సతీమణి దివ్యను చైర్పర్సన్‌గా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, రాం కుమార్ రెడ్డి ఆశీస్సులతో పోటీలో పెట్టినట్లు చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి అభ్యర్థి దివ్య, నియోజకవర్గ పరిశీలకు రారు కోడూరు కలపలత రెడ్డి, వైసిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, పార్టీ కన్వీనర్లు ప్రసాద్‌రెడ్డి, కార్తీకరెడ్డి, నాయకులు రాజారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో సర్పంచ్ స్థానాల రిజర్వేషన్ ఖరారు

బాలాయపల్లి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: మండలంలోని 24 పంచాయతీల్లో సర్పంచుల రిజర్వేషన్ ఖరారు అయినట్లు ఎంపీడీవో దాసరి నారాయణ తెలిపారు. అలిమేలి, పిగిలాము, కామకూరు, హస్త కావేరి ఎస్సీ జనరల్, బాలాయపల్లి, కయ్యూరు, నిడిగల్లు ఓసి జనరల్, జయంపు, వెంగమాంబపురం, నిండలి, కడగుంట వాసు ఉమెన్, కయ్యూరు ఎస్సీ జనరల్, పిరిమెడి ఎస్సీ ఉమెన్, గొట్టికాడు ఎస్టి జనరల్, పల్లిపాడు బిసి ఉమెన్‌లకు కేటాయించారు.

## చదువుల తల్లి సరస్వతీ దేవి అలంకరణలో ఎల్లమ్మ

**-అంగరంగ వైభవంగా శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఉత్సవాలు**



చంద్రగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: చదువుల తల్లి సరస్వతీ దేవి అలంకరణలో చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి దేవీ నవరాత్రి మహోత్సవాలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాలక మండలి, ఈఓ మమత పర్యవేక్షణలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ అర్చకులు సూరిస్వామి అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. సాయంత్రం 7 గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుగా ఆలయ పడికావలికి తీసుకువచ్చి వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి హంస వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండుబాజాల నడుమ ఓంశక్తి మాలధారణ గావించిన భక్తుల భజనలతో అమ్మవారి వాహనసేవ కన్నుల పండువగా సాగింది. మహిళలు అమ్మవారికి కర్పూర నీరాజనాలర్పించి మ్రొక్కులు తీర్చుకున్నారు.

## క్రీడాకారులతో కలిసి...బ్యాట్ పట్టిన బొజ్జల



రేణిగుంట, అక్టోబర్ 16 ప్రభాతవార్త: యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని శ్రీకాళహస్తి శాసన సభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొంది స్తాయని తెలుపుతూ, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. తూకివాకం గ్రామంలో ఏర్పాటు చేసిన చెంచు క్రికెట్ క్లబ్ బాక్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే దంపతులు క్రీడాకారులతో కలిసి టోర్నమెంట్‌ను ప్రారంభించి యువతలో ఉత్సాహాన్ని నింపారు.టోర్నమెంట్ ప్రారంభోత్సవం అనంతరం బొజ్జల సుధీర్ రెడ్డి, రిషితా రెడ్డి కొద్దిసేపు సరదాగా బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. క్రీడాకారులతో మమేకమై ఆటలో పాల్గొనడంతో అక్కడి యువత, అభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రేణిగుంట టీడీపీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్, కాపీ రెడ్డి నాద మునిరెడ్డి, జి.పాలెం రాజశేఖర్ రెడ్డి, అంబి యాదవ్, తూకివాకం మాజీ ఎంపీటీసీ నాగ సుబ్రహ్మణ్యం రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టోర్నమెంట్ ప్రారంభంతో తూకివాకం ప్రాంతంలోని క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

## మోహినీ అలంకారంలో...శృంగార రాయుడు



తిరుమల,అక్టోబర్ 14 ప్రభాతవార్తప్రతినిధి: శృంగార రాయుడు ఏడుకొండల వేంకటేశ్వర స్వామి శృంగార రసాధి దేవతగా మోహినీరూపంలో భక్తులకు మోక్షం కలిగించాడు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం దంతపు పల్లకీలో మలయప్పస్వామి చేతిలో బంగారపు చిలుకను ధరించి మరో రూపంలో పక్కనే శ్రీకృష్ణుడు అలంకృతుడై కన్నులపండువగా ఆలయంముందుకు విచ్చేశారు. కమనీయమైన శ్రీకాంతుని రూపం జగత్సమ్మోహకంగా కనువిందుచేసింది. శ్రీమహావిష్ణువు ఏరూపం ఎత్తినా,పురుషులకు కూడా సమ్మోహకుడవుతాడు. ఇక మోహినీ రూపంలో చెప్పవలసిన అవసరం లేదు. భక్తులకు అభయమిచ్చాడు. తనకు ప్రసన్నులైనవారు మాయను సులభంగా దాటగలరని ఈ మోహినీ రూపంలో ప్రకటించాడు. ఈ వాహనసేవలో టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి ్మ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జానకీ దేవి, రంగశ్రీ, ఆనంద సాయి, దర్శన్, నరేష్ కుమార్, ఎన్. సదాశివరావు, జేఈఓలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,అర్చకులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏను సత్కరించిన బిసి నాయకులు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బబొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిని బిసి నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా బిసి నాయకులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి మున్సిపాలిటి చైర్మెన్ పదవిని బిసిలకు ఽకేటాయించి బిసిల పట్ల బొజ్జల కుటుంబానికి గల గుర్తింపును కొనియాడారు.గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తి మున్సిపాలిటి జనరల్ రిజర్వ్ కాగా ఆ స్థానంలో బిసి నాయకుడు పేట రాధారెడ్డిని పోటీ చేయించి గెలిపించి బిసిల పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారని నేడు బిసిలకు కేటాయించారన్నారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఏకు దారుశిల్పాన్ని అందించి దుశ్శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు మాజీ సభ్యుడు బాలుడిల్లిబాబు గుమ్మడిదరశరదాచ్చారి, పేట బాలాజి, మాజీమున్సిపల్ వైస్ చైర్మెన్ మిన్నల్ రవి,రేణుకాదేవి, తదితరులుపాల్గొన్నారు.

## బిసి నాగరాజ్‌కు...సర్ విశ్వేశ్వరయ్య స్మారక అవార్డు

**- కెఐసికి దక్కిన ప్రతిష్టాత్మక పురస్కారం**



కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమ ఇంజనీరింగ్ కళాశాల అవార్డు లభించింది. కర్ణాటక రాష్ట్రంకు చెందిన ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐబిఎస్) అధ్వర్యంలో బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ మరియు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్‌కు ప్రతిష్టాత్మక సర్ విశ్వేశ్వరయ్య సార్మక అవార్డు 2026ను ప్రదానం చేశారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ ఆర్థిక సలహాదారు, మాజీ రాష్ట్రపతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, వివి గిరి మనవడు అయిన డాక్టర్ సుబ్రమణ్య శర్మ, కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సాయిరాం ప్రసాద్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. పాతికేళ్ల క్రితం కుప్పం ప్రాంతంలో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌ను స్థాపించి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు, స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన రంగాల్లో కెఐసి విశేష కృషి చేస్తోంది. ఈ అవార్డు తమ కళాశాల ప్రతిష్టను మరింత పెంచిందని ఛైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు.

### ఎలక్ట్రో స్టీల్ ప్రాంగణ ఎంపికల్లో...

## శ్రీ రామ ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ



తిరుపతి విద్య, అక్టోబర్ 16 ప్రభాతవార్త: ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతూనే ఉద్యోగ అవకాశాలను అంది పుచ్చుకునే దిశగా శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎలక్ట్రో స్టీల్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.3.5 లక్షల వేతన ప్యాకేజీ లభించనుంది. కంపెనీ నిర్వహించిన రాత పరీక్ష, సాంకేతిక పరీక్ష, ఇంటర్వ్యూ తదితర దశల్లో విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. వివిధ దశల్లో పోటీని అధిగమించి తుది రౌండ్‌కు చేరుకున్న ఇద్దరు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కంపెనీ మానవ వనరుల విభాగానికి చెందిన శ్రీవాస్తవ ఆధ్వర్యంలో ఈ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పరీక్షలు, ఇంటర్వ్యూల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ ఉద్యోగ సాధనకు దోహదపడింది.విద్యార్థులకు తరగతి గది బోధనకే పరిమితం కాకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు, సమాచార నైపుణ్యాలు, ఉద్యోగ సాధన శిక్షణ అందిస్తున్నామని కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థలను ప్రాంగణ ఎంపికలకు ఆహ్వానించి, విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.విద్యార్థుల నైపుణ్యాలను పరిశ్రమల అవసరాలకు అనుసంధానిస్తూ ఉద్యోగ అవకాశాలను పెంచడంపై కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వాసు, ప్రాంగణ ఎంపికల అధికారి టి.విష్ణువర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జోరువాన కురిసినా... సౌకర్యాలు కల్పన

**-గ్యాలరీల్లో భక్తుల సంతృప్తి**



రుమల,అక్టోబర్ 14 ప్రభాతవార్తప్రతినిధి: ఓవైపు జోరువాన మరోవైపు గరుడసేవకోసం ఉదయం నుండి గ్యాలరీల్లో నిరీక్షించిన భక్తులకు అర్ధరాత్రి వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు. కాఫీ, పాలు, 15రకా ప్రసాదాలు పంపిణీ చేశారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవను పురస్కరించుకుని శుక్రవారం మధ్యాహ్నం గ్యాలరీల్లో భక్తులకు కల్పించిన సౌకర్యాలను టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర ,అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి మధ్యాహ్నం వేర్వేరుగా పరిశీలించారు. ప్రతి భక్తుడికి శ్రీవారి దర్శనం, వాహనసేవ వీక్షణం సౌకర్యవంతంగా ఉండేలా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు ఈఓ,అదనపు ఈఓ తెలిపారు. భక్తులకు ప్రణాళికాబద్ధంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ అందించడంతో బాటు పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుండివచ్చిన భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకోగా, టిటిడి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వాహన మండపం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ విధానాన్ని వెంకయ్యచౌదరి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,టిటిడి అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రవర్తన నియమావళి పర్యవేక్షణ

**- ఒకొక్క మండలానికి ఒక ప్రత్యేక బృందం ఏర్పాటు - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్**

చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: రెండవ విడత సాధారణ ఎంపిటిసీ, జడ్పీటిసీ ఎన్నికలు-2026తో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్-ఎంసిసి) అమలు పర్యవేక్షణకు జిల్లాలోని 27 మండలాలకు సంబంధించి ఒకొక్క మండలానికి ఒక ప్రత్యేక బృందంను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 14వ తేదీ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రెండవ విడత సాధారణ జడ్పీటిసీ, ఎంపిటిసీ ఎన్నికల నిర్వహణతో పాటు జడ్పీటిసీ, ఎంపిటిసీ, సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి జిల్లాలో తక్షణమే అమలులోకి వచ్చిందని, జిల్లాలో మున్సిపల్, జడ్పీటిసీ, ఎంపిటిసీ, సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఈ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వుంటుందన్నారు. జిల్లాలో ఎన్నికల నియమావళి అమలు పక్కాగా పర్యవేక్షించడానికి మండలాల వారీగా తహసిల్దార్లు, పోలీసు సిబ్బంది, వీడియో గ్రాఫర్లతో ప్రత్యేక బృందాలు నియమించడం జరిగిందన్నారు. జిల్లాలోని 27 మండలాల తహసిల్దార్లు ఆయా మండలాలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పర్యవేక్షణ అధికారులుగా విధులు నిర్వహిస్తారన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వుంటుందని, సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు.

## వేదాం ఆలయంలో పూజలు



శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలోని వేదాం గ్రామం సమీపంలో వెలసిన దక్షిణ కాళిమాత ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు.దక్షిణ కాళి మాత అమ్మవారిని సరస్వతి దేవి అలంకారాన్ని నిర్వహించారు.అమ్మవారిని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఉదయం నుంచి ఇక్కడ భక్తులకు సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో తమిళనాడు,కర్నాటక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కోడ్ కూసింది... విగ్రహాలకు ముసుగులు పడ్డాయి!



రేణిగుంట, అక్టోబర్ 16 ప్రభాతవార్త: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో రేణిగుంట మండలంలో, ముఖ్యంగా పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు శుక్రవారం ముసుగులు వేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేసే చర్యల్లో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల సమయంలో ఓటర్లపై ఎలాంటి ప్రభావం పడకుండా, అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తుంది. ఇందులో భాగంగా రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన విగ్రహాలు, గుర్తులు, ప్రచార సామగ్రి ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉన్నచోట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. ఈ నేపథ్యంలో రేణిగుంట పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలను అధికారులు పరిశీలించి, వాటికి ముసుగులు వేసే చర్యలు చేపట్టారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాధారణంగా కనిపించే రాజకీయ నాయకుల విగ్రహాలు సైతం ముసుగుల్లోకి వెళ్లడంతో రేణిగుంట పట్టణంలో ఎన్నికల సందడి మొదలైందనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

## గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం : దివాకర్‌రెడ్డి



రేణిగుంట, అక్టోబర్ 16 ప్రభాతవార్త: తిరుపతి-చెన్నై జాతీయ రహదారి సమీపంలోని తూకివాకం గ్రామంలో నూతనంగా నిర్మించిన చెంచు క్రికెట్ క్లబ్ మైదానాన్ని తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఎక్స్ అఫీషియో సభ్యుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి శుక్రవారం ఉదయం రిబ్బన్ కత్తిరించి ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ మైదానం అందుబాటులోకి రావడం స్థానిక యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దివాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, పట్టుదలను పెంపొందిస్తాయని తెలిపారు. జట్టుగా ఆడే క్రీడల ద్వారా ఐకమత్యం, పరస్పర సహకారం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం క్రీడలతోనే సాధ్యమవుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ, తగిన మైదానాలు, శిక్షణ సదుపాయాలు లేకపోవడంతో తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు కొరవడుతున్నాయని అన్నారు. గ్రామాల్లో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించేందుకు యువత, స్థానిక నాయకులు, క్రీడాభిమానులు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తూకివాకం మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు భాస్కర్ యాదవ్, టిడిపి నేత మాజీ ఎంపీటీసీ నాగ సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న...

### జోరువానలోనూ భక్తజనం

తిరుపతి రూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త:
తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తి పారవశ్యంతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజైన శుక్రవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. జోరువాన కురుస్తున్నా భక్తులు వెనుకడుగు వేయకుండా స్వామివారి దర్శనానికి భారీగా తరలివచ్చారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగగా, గరుడ వాహనంపై కొలువుదీరిన కల్యాణ వెంకన్నను దర్శించుకుని భక్తులు పరవశించారు.

ఆరు గంటలపాటు వైభవంగా గరుడోత్సవం:

సుమారు ఆరు గంటలపాటు సాగిన గరుడ వాహన సేవలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టగా, ఆలయ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. తుమ్మలగుంట శివార్లలోని ఆమోగ్య, శరీనా గ్రాండ్, ఎస్ఎల్‌వీ సన్నిధి, వెంకటాద్రి, లోటస్, సమగ్ర అపార్ట్‌మెంట్ల వాసులు స్వామివారికి సంప్రదాయబద్ధంగా సారె సమర్పించారు.

మోహినీ అవతారంలో మురిపించిన స్వామివారు:

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అలంకరణతో పల్లకిపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భజనల నడుమ సాగిన పల్లకీ సేవ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రేషన్ షాపు వీధి, శ్రీలక్ష్మీనగర్, పడమటి వీధి, చిట్టపాలెం వీధులకు చెందిన భక్తులు స్వామివారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గరుడోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కోలాటాలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవి విన్యాసాలు, కేరళ వాయిద్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుల నృత్యాలు, దేవతామూర్తుల వేషధారణలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గకపోవడంతో తుమ్మలగుంటలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్వామివారి వాహన సేవలను తిలకిస్తూ భక్తులు గోవింద నామస్మరణలో మునిగిపోయారు.

## బీసీలకు 34 కాదు...40 స్థానాలను ఇస్తున్నాం!



శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త: గడిచిన నాలుగు దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో బీసీల రాజకీయ ఎదుగుదలకు, సామాజిక మరియు ఆర్థిక పురోగతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీ నేడు ఎన్డీయే కూటమి పార్టీలోని ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో బీసీలకు 34 కాకుండా 40 పైగా స్థానాలను కేటాయించడం శుభపరిణామమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంఎల్ఏను బిసి నాయకులు ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారన్న ఏకైక కారణంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని సహించలేని జగన్ కేసులేసి అడ్డుకున్నాడని ఆరోపించారు. కానీ, ఎన్డీయే కూటమి ప్రభుత్వం చంద్రబాబు చొరవతో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో 40 శాతం రిజర్వేషన్ ఇచ్చి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం శుభపరిణామమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా. జి. దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్ రావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పేట బాలాజీ రెడ్డి, డిల్లీ బాబు, బీమాల మునికృష్ణ, మునిరాజా యాదవ్, గాండ్ల తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు, భాస్కర్ గౌడ్, నాగరాజు, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, ఎం.ఎస్. రెడ్డి, మురళి, రామచంద్రయ్య, సిద్దులయ్య, పూల శేఖర్, శంకరయ్య, గాజుల భగత్, గగన్ యాదవ్, సులేమాన్, శివ ఆచారి, శేషు, బాబు రెడ్డి, ఓంకార్, చంద్రశేఖర్, రమేష్, మణెయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలు: తొలిరోజు మేయర్ స్థానానికి ఒకటి, కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్ల దాఖలు

## మేయర్ అభ్యర్థిగా ఆమ్ ఆద్మీ పార్టీ తరపున నీరుగట్టు నగేష్ నామినేషన్



***తిరుపతి కార్పొరేషన్, 16 ప్రభాతవార్త:*** తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియ తొలిరోజైన శుక్రవారం మేయర్ స్థానానికి ఒక నామినేషన్, కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్లు దాఖలయ్యాయి. మేయర్ స్థానానికి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా నీరుగట్టు నగేష్ నామినేషన్ దాఖలు చేశారు. కార్పొరేటర్ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీలు, ఇతర అభ్యర్థుల నుంచి మొత్తం 88 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్టీలు, ఇతరుల వారీగా నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి:

తెలుగుదేశం పార్టీ - 10, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ - 61 జనసేన పార్టీ - 4 సీపీఐ - 1
ఇతరులు - 12 తొలిరోజు మేయర్, కార్పొరేటర్ స్థానాలకు కలిపి మొత్తం 89 నామినేషన్లు దాఖలయ్యాయి.

## పారామిలిటరీ బలగాల పర్యవేక్షణలో...

### ఎన్నికలు నిర్వహించాలి: చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త :



పోలీసుల సమక్షంలో ప్రజాప్రతినిధులు, ఎన్నికల అభ్యర్థులు, మీడియా ప్రతినిధులపై దాడులు జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విమర్శించారు. పుంగనూరులో ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై దాడి, తిరుపతిలో నామినేషన్లకు అడ్డంకులు, రాయచోటిలో పార్టీ కార్యాలయంపై దాడి, వాహనాల దహనం వంటి ఘటనలపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై ఇనుప రాడ్లు, కర్రలు, రాళ్లతో దాడి చేసి వాహనాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన అభినయ్‌రెడ్డిపై దాడికి యత్నించడం, నామినేషన్ పత్రాలను చించివేయడం ప్రజాస్వామ్య హక్కులకు విఘాతమని పేర్కొన్నారు. ఘటనలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధుల కెమెరాలు, సెల్‌ఫోన్లను ధ్వంసం చేయడం చట్టవిరుద్ధమని విమర్శించారు. రాష్ట్ర పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో పారామిలిటరీ బలగాల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు.

## సర్టిఫికెట్ల అక్రమ జారీపై కఠిన చర్యలు తీసుకోవాలి




తిరుపతి హెల్త్, అక్టోబర్ 16 ప్రభాత వార్త: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌడ, ఈడిగ కులాలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లతో కొందరు అనర్హులు పోటీ చేసేందుకు యత్నిస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా ఈడిగ (గౌడ్) సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడవాటి మల్లికార్జున్ గౌడ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన గౌడ సంఘం నేతలతో కలిసి మాట్లాడారు. అర్హత లేకపోయినా అక్రమంగా సర్టిఫికెట్లు పొంది సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులను కొల్లగొట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. గౌడ, ఈడిగ కులాలకు వృత్తిపరంగా ఇచ్చే కుల ధ్రువీకరణ పత్రాలను కొందరు అక్రమ మార్గాల్లో పొందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నకిలీ పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల నిజమైన వృత్తిదారులకు, అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్వోలు, ఆర్డీవోలు వెంటనే స్పందించాలని కోరారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ప్రతి సర్టిఫికెట్ ను క్షుణ్ణంగా పరిశీలించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అభ్యర్థులను గుర్తించి నామినేషన్లను తిరస్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు టి.చిరంజీవులు గౌడ్, ప్రధాన కార్యదర్శి దిండుపాటి నాగేశ్వరరావు, గౌరవ సలహాదారులు ఎం.మురళీధర్ గౌడ్, ఏ.ఆనంద్ బాబు, కోశాధికారి అట్లూరి రామారావు గౌడ్, మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ డైరీలో చివరి పేజీలు సినిమాని ఆదరించండి

### - చిత్రం డైరెక్టర్ డాక్టర్ కిరణ్



తిరుపతి హెల్త్, అక్టోబర్ 16 ప్రభాతవార్త: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పాదాల చెంత ప్రేమ డైరీలో చివరి పేజీలు సినిమా ప్రమోషన్ మొదటి సమావేశం నిర్వహించడం చాలా ఆనందంగా ఉన్నదని డైరెక్టర్ డాక్టర్ కిరణ్ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రేమ డైరీలో చివరి పేజీలు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నందు ఈరోజు సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 23న రెండు తెలుగు రాష్ట్రాలలో సుమారు 50 థియేటర్లలో సినిమా రిలీజ్ అవుతుందని, బుక్ మై షో ద్వారా టికెట్స్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. హీరో,ప్రొడ్యూసర్ పి.వి అర్జున్ మాట్లాడుతూ తను సాఫ్ట్వేర్ ఉద్యోగం వదులుకొని సినిమా మీద వ్యామోహంతో సేవింగ్ చేసిన డబ్బులతో సినిమా నిర్మాణంలోకి వచ్చానని, సినిమా ఆత్మగౌరవం నేపథ్యంలో తీసిన కుటుంబ కథా చిత్రం అని కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా అన్నారు. ఈ చిత్రంలో సీనియర్ నటులైనటువంటి గౌతమ్ రాజు, సునీత మనోహర్, నూతన నటీనటులు, నటించారన్నారు.

## వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



పుత్తూరురూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త:
పుత్తూరు పట్టణంలోని పలు ఆలయాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తు న్నారు. అలాగే మండల పరిధి లోని పలు ఆలయాల్లో కూడా వివిధ అలంకరణలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని సరస్వతీదేవి అలంకరణ ముత్యాల అలంకరణలతో సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## నామినేషన్ వేయడానికి కత్తులు, గొడ్డళ్లు...

### ఎందుకు మిథున్ రెడ్డి

### - శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



తిరుపతి హెల్త్, అక్టోబర్ 16 ప్రభాతవార్త: గత ఐదు సంవత్సరాల జగన్మోహన్ రెడ్డి పాలనలో ఏనాడైనా గొడవలు, రౌడీలు, దొంగ ఓట్లు లేకుండా ఎన్నికలు ఏనాడూ నిర్వహించలేదని, గతంలో మాదిరే ఇప్పుడు అలా చేస్తామంటే, ఇక్కడ ఉన్నది కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో మీ అరాచకాలుకు తావు లేదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నామినేషన్‌కు వచ్చేటప్పుడు కర్రలు, గొడ్డళ్లు, కత్తులతో పనేంటని, వచ్చామా నామినేషన్ వేసామా వెళ్దామా అన్నట్టు ఉండాలని, అరాచకాలు, రౌడీయిజం, గుండాయిజం చేసి ప్రజల్లో భయాందోళన సృష్టిస్తే మీ నాయకుడు దృష్టిలో మీరు పడి కాంట్రాక్ట్ వర్కర్స్, మంత్రి పదవుల కోసం అరాచకాలు సృష్టించడం ఎంత వరకు సమంజసం అని మిథున్ రెడ్డిని సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. టిడిపి కార్యకర్తలపై మిథున్ రెడ్డి వాహనంతో వారిని తొక్కించడానికి స్వరవిహారం చేశారని, ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని, అరాచకాలు, రౌడీయిజం, మీరు చేసి నిందలు మాపైన వేస్తారా మిథున్ రెడ్డి చేసిన పనికి ఒక రెడ్డిగా బాధపడుతున్నా అన్నారు. మా కార్యకర్తలు మా పార్టీ వాళ్ళ పై దాడులు, రౌడీయిజం చేస్తూ వుంటే చూస్తూ ఉండాలా ఇకమీదట మా నాయకుని మాట మేము వినదల్చుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు కావలసిన అన్ని వసతులు రోడ్లు, ఇండ్ల నిర్మాణం కోసం స్థలాలు ఇస్తుంటే, ప్రభుత్వం అభివృద్ధి బాటలో ముందుకు వెళుతుంటే ఓర్వలేని బడా నాయకులు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇకమీదట మీరు సై అంటే మేము సై సై అంటామన్నారు. రౌడీయిజంతో జనాలను భయపెట్టాలని చూస్తారా ఇదేమన్నా రాజారెడ్డి రాజ్యాంగమా మీరు ప్రభుత్వంలో ఉన్నారనే భ్రమలో ఇంకా ఉన్నారా, ఇక్కడ నడుస్తున్నది కూటమి ప్రభుత్వ పాలనని మీరు ఎక్కడైతే టిడిపి కార్యకర్తలను ఇబ్బంది పెడతారో అక్కడ టిడిపి నాయకులు, కేడర్ ఉంటాదని, మీరు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలకు సహకరించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైసీపీ నాయకులను, కార్యకర్తలను హెచ్చరించారు.

## ఇండిగో విమానానికి... వర్షం ఎఫెక్ట్!

**రేణిగుంట, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. కొన్ని గ్రామాలు, కాలనీలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వర్షం ఎఫెక్ట్ రేణిగుంట విమానాశ్రయం పై కూడా పడింది. విమానాశ్రయ పరిసర ప్రాంతాలు పూర్తిగా వర్షపు నీటిలో మునిగాయి. బయట నుండి వర్షపు నీరు వేగంగా విమానాశ్రయం ప్రహరీ గోడను ఆనుకొని ప్రవహించడంతో విమానాశ్రయ గోడ కూలినట్లు సమాచారం. అదేవిధంగా విపరీతమైన వర్షం కారణంగా మధ్యాహ్నం 3.20 నిమిషాలకు రేణిగుంట ఎయిర్పోర్టులో ల్యాండ్ కావాల్సిన ఇండిగో విమానం కొంతసేపు గాలిలో చెక్కర్లు కొట్టి చెన్నై ఎయిర్ పోర్ట్‌లోల్యాండ్అయినట్టుతెలిసింది. అయితే ఈ విషయాన్ని విమానాశ్రయ అధికారులు ధ్రువీకరించలేదు.

## ఎన్నికలా... బీఈడీ పరీక్షలా? విద్యార్థుల్లో సందిగ్ధం

తిరుపతి విద్య,అక్టోబర్ 16 ప్రభాతవార్త:



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోకుండా బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ ఎస్వీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు మహేష్ బాబు డిమాండ్ చేశారు. ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 27 నుంచి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థుల హక్కులు, విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు పరీక్షల షెడ్యూల్‌పై పునరాలోచించాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే విద్యార్థులు, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనుకునే వారు పరీక్షల షెడ్యూల్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కోకూడదని ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు మహేష్ బాబు పేర్కొన్నారు. పరీక్షలు, ఎన్నికల ప్రక్రియ ఒకే సమయంలో ఎదురైతే విద్యార్థులు ఏదో ఒక అవకాశాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై విశ్వవిద్యాలయ అధికారులు తక్షణమే స్పందించి పరీక్షల వాయిదాపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు. విద్యార్థుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని పరీక్షల తేదీలను సవరించాలని సూచించారు. విద్యార్థుల ఎన్నికల హక్కులకు అవకాశం కల్పిస్తూనే వారి విద్యా భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా విశ్వవిద్యాలయ అధికారులు సముచిత నిర్ణయం తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఎస్ వి యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు మహేష్ బాబు డిమాండ్ చేశారు.

## కార్యాలయ సిబ్బందికి యూనిఫాంలు పంపిణీ

నాగలాపురం, అక్టోబరు 16 ప్రభాతవార్త:



నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యాలయ సిబ్బంది సమావేశంలో వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న సిబ్బందికి యూని ఫాంలు పంపిణీ చేశారు. అలాగే సిబ్బంది తమ తమ విధి నిర్వహణ స్థలాల్లో ఎలా వ్యవహరించాలి, తమ విధులను మరింత సమర్థవంతంగా బాధ్యతాయుతంగా ఎలా నిర్వర్తించాలి అనే విషయాలపై వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎస్.దామోధరన్, కార్యదర్శి కుమార్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సమావేశంలో సిబ్బందితో చర్చించి వారి విధులు, పనితీరుకు సంబంధించి పలు విషయాలపై మార్గదర్శకత్వం కల్పించారు.

## విద్యుత్ తీగలు తెగిపడి బర్రెలు మృతి!

సత్యవేడు, అక్టోబరు 16 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా సత్యవేడు మండలం వెంకటరాజుల కండ్రిగ వద్ద విద్యుత్ తీగలు తెగిపడి రెండు బర్రెలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... గ్రామంలోని మేత కోసం బర్రెలను మునీశ్వర స్వామి ఆలయం సమీపంలో పొలాల వద్దకు పాడి రైతు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఒక్క సారిగా మేఘాలు కమ్ముకుని వర్షం పడడంతో అనుకోకుండా విద్యుత్ తీగలు బర్రెల మందపై పడడంతో విద్యుత్ ఘాతానికి గురై రెండు బర్రెలు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరువైపులా వాహన రాకపోకలు కూడా స్తంభించకపోవడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాత్యాయని అలంకరణలో షష్టిదుర్గ

### వైభవంగా శ్రీ ఉగ్రప్రత్యంగిరాకాళి నవరాత్రి ఉత్సవాలు



చంద్రగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: కాత్యాయని అలంకరణలో షష్టిదుర్గ భక్తులకు దర్శనమి చ్చారు. తొండవాడ పంచాయతీలోని శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పీఠాధిపతి సూరీ స్వామి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం అమ్మవారికి అభిషేకం జరిపించారు. తదుపరి కాత్యాయని హోమం నిర్వహిం చారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణతో దేదీప్యమానంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

## సత్యవేడులో ఎంపీపీ పదవిపై ఉత్కంఠ

### -మాజీ, ప్రస్తుత మండల అధ్యక్షుల మధ్య పోటీ..?

సత్యవేడు, అక్టోబరు 16 ప్రభాతవార్త:
సత్యవేడు మండలంలోఎంపీపీ పదవి వ్యవహారం తెలుగుదేశం పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. ఎంపీపీ పదవిని దక్కించుకునే విషయంలో మాజీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రస్తుత మండల అధ్యక్షుడు శివకుమార్ నాయుడు పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మాజీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి పార్టీ కో- ఆర్డినేటర్ అండదండలు ఉన్నాయని ఒక వర్గం తెలుగు తమ్ముళ్లు పేర్కొంటుండగా, ప్రస్తుత మండల అధ్యక్షుడు శివకుమార్ నాయుడుకి పార్టీ అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయని మరో వర్గం చెబుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎంపీపీ పదవి ఎవరిని వరిస్తుందన్న అంశంపై స్థానిక టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇరువురు నాయకులకు సంబంధించి వినిపిస్తున్న వాదనలతో మండల రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. అయితే ఎంపీపీ పదవిపై పార్టీ అధిష్టానం వైఖరి ఏమిటి...? ఆశావహుల్లో ఎవరికి అవకాశం దక్కనుంది...? పార్టీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు...? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయంతోనే ఈ వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## సత్యవేడులో భారీ వర్షం

సత్యవేడు, అక్టోబరు 16 ప్రభాతవార్త:
సత్యవేడులో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాసింది. ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అనంతరం చిరుజల్లులతో మొదలైన వర్షం, మోస్తరుగా కురిసింది. పట్టణంలోరోడ్లుజలమయ్యాయి. ఉక్కపోతతోఅల్లాడినజనంవాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు.

## నాగలాపురం వైసీపీలో ఎన్నికల సందడి

### -19 గ్రామ పంచాయతీల నుంచి పోటా పోటీగా దరఖాస్తులు



నాగలాపురం, అక్టోబరు 16 ప్రభాతవార్త: నాగలాపురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వైసీపీ పార్టీ నాయకులు,కార్యకర్తల నుంచి మండల కన్వీనర్ అపరంజిరాజు ఆధ్వర్యంలో బయోడేటా ఫారాలను స్వీకరించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ పెద్దలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయా స్థానాల నుంచి ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్న ఆశావహులు తమ బయోడేటాలను సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సమావేశ ప్రాంగణం సందడిగా మారింది. ఒక్కో స్థానానికి పలువురు నాయకులు పోటీ పడుతుండడంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశంపై పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా మండల కన్వీనర్ అపరంజి రాజు మాట్లాడుతూ, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి బయోడేటాలను సేకరించినట్లు తెలిపారు. అందిన బయోడేటాలను పరిశీలించిన అనంతరం పార్టీ నిర్ణయం మేరకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్ననాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని తదుపరి నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం మాజీ సర్పంచ్ చిన్నదొరై, మాజీ ఎంపీపీ శ్యామ్, కె.దేశప్పన్, జె.బి.మునిరత్నం, విశ్వారెడ్డి, జగదీష్‌రెడ్డి, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిథున్‌రెడ్డిని జిల్లా నుండి బహిష్కరించాలి

తొట్టంబేడు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:



బాధ్యత కలిగిన ఎంపీ స్థానంలో ఉన్న మిథున్ రెడ్డి చేసిన అతికిరాతకమైన, భయంకరపు అరాచకపు చేష్టలను చూసి సభ్య సమాజం అసహ్యించుకుంటుందని, పుంగనూరు పరిసర ప్రాంతాలలో ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందుబాటులో ఉండాలంటే తక్షణమే జిల్లా నుండి బహిష్కరించాలని వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం. ఉమేష్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, దీనిలో భాగంగా పుంగనూరు నియోజకవర్గ పరిధిలో నామినేషన్లు వేయడానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులపై ఎంపీ మిథున్ రెడ్డిఅతని కిరాయి గూండాలతో వచ్చి అత్యంత పాశవికంగా దాడులకు తెగబడి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను తమ వాహనాలతో తొక్కి చంపేయడానికి ప్రయత్నించారని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఆరోపించింది. గత మూడు దశాబ్దాలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాలలో ఆటవిక మనుషుల లాగా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలను అపహాస్యం చేస్తూ, ప్రజలు ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లేకుండా చేసి, రౌడీ మూకలతో రిగ్గింగ్ చేసుకొని గెలిచే పెద్దిరెడ్డి కుటుంబ చరిత్ర మొత్తం పిరికితనంతో నిండి పోయిందని ఆరోపించారు.మిన్నల్ రవి, డా. ఎం. ఉమేష్ రావు, భీమాల భాస్కర్, కోట చంద్రశేఖర్, చిల్లకూరు మణి, పూల శేఖర్, శంకరయ్య, గంగనపల్లి రమేష్, సులేమాన్, లోకేష్ తదితరు లు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్ తగిలి బాలిక ఆస్పత్రి పాలు

బైరెడ్డిపల్లి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

మండలంలోని పంచాయతీ కేంద్రమైన గౌనితిమ్మేపల్లి గ్రామంలో ఓ బాలిక విద్యుత్ షాక్‌కు గురై ఆస్పత్రిలో చేరింది. గ్రామానికి చెందిన అంజలి (13) అనే బాలిక తమ ఇంట్లో దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురైనట్లు స్థానికులు తెలిపారు. దీంతో బాలికను హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా బాలిక కోలుకుంటున్నట్లు చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం!

చిట్వేలి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: చిట్వేలి గ్రామంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవమాచుపల్లి పంచాయతీ దొగ్గలపాడుకు చెందిన మూరి యానాదయ్య (55) మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మామందూరులో వివాహానికి హాజరై చిట్వేలికి చేరుకున్నారు. తిరిగి ఇంటికి వెళ్ళే క్రమంలో ఉదయం 11.30 గంటల సమయంలో ఆటో కోసం పాత ప్రభుత్వ ఆసుపత్రి భవనం వద్ద రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా లారీ వెనక టైర్లు అతనిపై వెళ్లడంతో మృతుడు యానాదయ్య అక్కడికక్కడే మృతి చెందారు.మృతుడి కుమారుడు నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ను గుర్తించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై వినోద్ కుమార్ తెలియపరిచారు

## జ్ఞానప్రదాయిని సరస్వతీ దేవిగా అమ్మవార్లు.

చిట్వేలి, అక్టోబర్ 16, ప్రభాతవార్త:



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా పాత చిట్వేలిలోని శ్రీ భద్రకాళి అమ్మవారు, చిట్వేలిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్య, జ్ఞానం, వాక్కు, వివేకానికి ప్రతీకగా మూలా నక్షత్రం రోజున కొలువుదీరిన వాగ్దేవి సరస్వతీ దేవిని దర్శించుకునేందుకు తమ పిల్లలతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చారు. స్థానిక శ్రీ సాయి వికాస్ విద్యాసంస్థల యాజమాన్యం భద్రకాళి అమ్మవారి అలంకరణ, మధ్యాహ్నం అన్నదానం ఉభయలుగా నిలిచారు. పిల్లలకు పెన్నులు పుస్తకాలు పంపిణీ చేశారు. కాగా శ్రీ వాసవి మాత ఆర్యవైశ్యులు ఉదయం బిందె సేవ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. యువత, ఆర్యవైశ్య పెద్దలు ఈ సేవలో సంప్రదాయ వస్త్రాలతో విశేషంగా పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటమి భయంతోనే గొడ్డలి పార్టీ అల్లర్లు

– హింస ద్వారా ఎన్నికలను అడ్డుకోవాలని కుట్రలు చేస్తోంది

– రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహా యాదవ్



***తిరుపతి హెల్త్, అక్టోబర్ 16, ప్రభాతవార్త*** ఈ రోజు పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో జరిగిన ఘటనలు గొడ్డలి పార్టీ హింసా సంస్కృతికి నిదర్శనం అని,ఓటమి భయంతో తొలి రోజు నుంచే దాడులు, హింసతో ప్రజలలో భయాన్ని సృష్టించాలని వైసీపీ పన్నాగాలు పన్నుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ తన ఇంటి వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. నరసింహ యాదవ్ మాట్లాడుతూ భారీ కాన్వాయ్‌తో,పొరుగు రాష్ట్రాల, ప్రాంతాల నుంచి రౌడీలను తోలుకొచ్చి వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నరన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించే అలవాటు లేని గొడ్డలి పార్టీ, తొలిసారి ప్రశాంతంగా ఎన్నికలు జరిగే పరిస్థితి రావడంతో ఫ్రస్టేషన్తో దాడులు చేస్తోందని ఆరోపించారు. వైసీపీ కుట్రలను అధికారులు గట్టిగా అడ్డుకోవాలని, ఎన్నికలకు ప్రశాంత, శాంతియుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా జరగాలని టీడీపీ కోరుకుంటున్నదని, గొడ్డలి పార్టీ రెచ్చగొట్టే విధానాలతో దాడులకు పాల్పడుతోందన్నారు. ఓటమి భయంతో ఎన్నికలు జరగకుండా వైసీపీ పార్టీ అల్లర్లకు తెగబడుతోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో విపక్ష అభ్యర్థులను కనీసం నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలు లాక్కొని చించివేయడం, అభ్యర్థుల కాళ్లు చేతులు విరగ్గొట్టడం, రిటర్నింగ్ అధికారులను బెదిరించి దొంగ ఏకగ్రీవాలు చేసుకోవడం వైసీపీకి అలవాటైన ఫ్యాక్షన్ సంస్కృతి అని, ఇప్పుడు ఇక్కడ నడుస్తున్నది కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పాలనలో ఇలాంటి వాటికి తావులేదని, ప్రజల మద్దతుతో గెలిచిన కూటమి ప్రభుత్వం అయునప్పుడు, ప్రజల మద్దతు మాకు ఉన్నప్పుడు మేమెందుకు దాడులు చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు 164 సీట్లతో కూటమి ప్రభుత్వానికి చారిత్రక విజయాన్ని అందించారు. ప్రజాబలం, సంక్షేమం, అభివృద్ధి అజెండాతో నేరుగా ప్రజల ముందుకు వెళ్తున్న కూటమికి ఎవరి మీదా దాడులు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికలు జరిగితే డిపాజిట్లు కూడా దక్కవని తెలిసిన వైసీపీ పార్టీ వాళ్లే అల్లర్లు, దౌర్జన్యాలు, రౌడీయిజం, చేస్తారన్నారు. ఇది గత వైఎస్ నాటి అరాచక, విధ్వంసకర పాలన కాదు. ఇది చట్టబద్ధంగా, రాజ్యాంగ నియమాలకు లోబడి నడుస్తున్న ప్రజా ప్రభుత్వం అని, ఇక్కడ రౌడీయిజం, ముఠా తగాదాలను ప్రోత్సహించే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, యువతకు ఉపాధి, తల్లికి వందనం వంటి పథకాలతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తిరుగులేని విశ్వాసం ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ స్వరాజ్యాన్ని కాపాడుకోవడానికి పల్లె ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చే తీర్పుతో వైసీపీ ఫ్యాక్షన్ సంస్కృతికి, తాడేపల్లి అహంకారానికి శాశ్వతంగా సమాధి కట్టడం తథ్యం అన్నారు.

## జోరువానలోనూ

'గరుడ' వీక్షణకు జడవని జనం –వాహనసేవకు ముందే పులకింత



**తిరుమల, అక్టోబర్ 14 (ప్రభాతవార్త)తిరుపతి:** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడసేవకు ముందు శుక్రవారం మధ్యాహ్నం 12గంటల నుండి ఏడుకొండల్లో భారీ వర్షం కురుస్తోంది. సాయంత్రం కొంత తగ్గినా వాహనసేవ ఆరంభించిన మళ్ళీ వర్షంతో పలకరించి పులకరించారు. జోరువాన కురిసినా భక్తులు గొడుగుల క్రింద గ్యాలరీల్లో అలాగే కూర్చుని వాహనసేవకోసం పరితపించారు. సహజంగా గరుడసేవకు వరుణదేవుడు పలకరించడం ఆనవాయితీ. ఈ ఏడాది కొన్నిగంటలకు ముందుగానే వాహనసేవకు ముందే వర్షం జోరుగా కురిసింది. అల్పపీడనం ప్రభావంతో తిరుమలలో భారీవర్షం కురవడంతో గ్యాలరీల్లోని భక్తులు తడిసిముద్దయ్యారు. భక్తితో గరుడవాహనకోసం గ్యాలరీల్లోంచి బయటకు రాలేదు. తిరుమలకొండపై మధ్యాహ్నం నుండి జోరుగా వర్షం కురుస్తూనే వుంది. ఎడతెరిపిలేకుండా జోరుగా వాన కురవడంతో వాతావరణంలో మార్పుతో చల్లగాలులు వీస్తున్నాయి. మధ్యాహ్నం మొదలైన వాన సాయంత్రం వరకు కురుస్తోంది.భక్తులు ఎక్కడికక్కడే ఆగిపోయారు. తిరుమలలో కురిసిన భారీ వర్షానికి ఆలయ ప్రాంతం, పరిసరాలు జలమయంగా మారాయి. తిరుమలకొండలను పొగమంచు కప్పేసింది. సాయంత్రం నుండి పూర్తిగా మంచుతో తిరుమలను కప్పేయడంతో వాహనాలు, భక్తులు దగ్గరగా వస్తేగాని కనిపించనిపరిస్థితి లేదు. చలిపరిశితంగా వుంది.

## దక్షిణ కాళీమాత ఆలయంలో హోమాలు: అన్నదానాలు

శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తికి దక్షిణాన వెలసిన దక్షిణ కాళీమాత ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి కుటుంబసభ్యులు భక్తి శ్రద్ధలతో హోమాలు, అన్నదానాలు నిర్వహించారు. కుమార్తె కాలంరెడ్డి పవిత్ర, అల్లుడు కాలం రెడ్డి కౌశిక్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి మాట్లాడుతూ పండుగలు మన సంప్రదాయాలకు దిక్సూచిలన్నారు. ముఖ్యంగా కాళీ మాత ఆలయంలో పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులతో కిట కిట లాడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మధుసూదనరెడ్డి భక్తులకు అన్నదానం జరిపారు. వైకాపా నాయకులు పవన్ ఫరీద్ దుశ్శాలువతో సత్కరించారు.

## శ్రీకాళహస్తిలో రణబాలి విడుదల వేడుకలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తిలో విజయ్ దేవరకొండ నటించిన రణబాలి చిత్రం విడుదల సందర్భంగా వేడుకలు ఘనంగా జరిగాయి. భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చి విజయ్ దేవరకొండ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి సినిమా విజయవంతం కావాలని కోరారు. సినిమాని అందరూ ఆదరించి విజయం చేకూర్చాలని అభిమానులు కోరారు. ఈ విజయ్ దేవరకొండ ఫ్యాన్స్ అధ్యక్షుడు నితీష్, సుబ్బు, ప్రకాష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## గొడ్డలి పార్టీ హింసా సంస్కృతిని సాగనివ్వం: గురవారెడ్డి

శ్రీకాళహస్తి అక్టోబర్ 16 ప్రభాతవార్త:



స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తాడేపల్లి డైరెక్షన్లో గొడ్డలి పార్టీ అల్లర్లు, హింస ద్వారా ఎన్నికలను అడ్డుకోవాలని ప్రయత్నిస్తోందని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం రోజు పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో జరిగిన ఘటనలు గొడ్డలి పార్టీ హింస సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ఓటమి భయంతో తొలి రోజు నుంచే దాడులు, హింస సృష్టించాలని వైసీపీ పన్నాగాలు పన్నుతోందని విమర్శించారు. నామినేషన్ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డి తన వాహనాల ద్వారా పక్క రాష్ట్రాల నుంచి రౌడీలను, అల్లరి మూకలను తీసుకొచ్చి పుంగనూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై దూసుకుపోవడం, వాహనంతో తొక్కించడానికి ప్రయత్నించడం, దాడులకు తెగబడి రక్తపు గాయాలు చేయడం దారుణమని అన్నారు. ఈ మీడియా సమావేశంలో వైస్ ఎంపీపీ మురుగన్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మునయ్య, మండల పార్టీ నాయకులు సదా శంకర్ నాయుడు, మనీ మొదలియార్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాలెంలో విషాదం

తొట్టంబేడు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:



మండలంలోని పొయ్యి పంచాయతీ పరిధిలోని గురుకుల పాలెం గ్రామంలో పెరమిడి సంపూర్ణమ్మ అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు ఆమె ఇంటికి చేరుకుని భౌతిక కాయాన్ని దర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సంపూర్ణమ్మ మరణం గ్రామానికి తీరని లోటని, ఆమె కుటుంబానికి తమ వంతు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఖర్చుల నిమిత్తం వాసుదేవ నాయుడు తన వంతుగా ఆర్థిక సహాయం కూడా అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలబడటం తమ బాధ్యత అని తెలిపారు. సంపూర్ణమ్మ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆమె ఇంటికి చేరుకుని నివాళులర్పించారు.

## తొట్టంబేడులో 27 పంచాయతీల్లో బీసీకి ఒక్కటే!

తొట్టంబేడు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:




తొట్టంబేడు మండలంలో సర్పంచ్ రిజర్వేషన్ల జాబితా అంతా గందరగోళంగా మారిందని కూటమి నాయకులే మలగుల్లాలు పడుతున్నారు. రిజర్వేషన్ల తంతు అంతా మాయాజాలంగా మారిందని వాపోతున్నారు.అధికారులు ఏ ప్రాతిపదికన రిజర్వేషన్లు చేసారని చర్చించుకుంటున్నారు. ఈ రిజర్వేషన్లను చూస్తే బీసీ వర్గాలకు గుండె బరువెక్కుతోందని చర్చించుకుంటున్నారు. మొత్తం 27 గ్రామ పంచాయతీలున్న మండలంలో బీసీ మహిళకు దక్కింది కేవలం ఒక్కటే సర్పంచ్ స్థానం. మరి బీసీ పురుషులకు? సున్నా. బీసీ జనరల్‌కు ఒక్క స్థానం కూడా లేదు. ఇది రిజర్వేషన్ పేరుతో జరిగిన అత్యంత దారుణమైన అన్యాయమని మండల కూటమి నాయకులే బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అని మాటిచ్చారని కానీ తొట్టంబేడులో ఆ మాట గాలికి పోయిందని శివమెత్తుతున్నారు. 27కి 1 అంటే కేవలం 3.7 శాతం. 34 శాతం ఎక్కడ? 3.7 శాతం ఎక్కడ? ఈ లెక్కకు సమాధానం ఎవరు చెబుతారు?ప్రభుత్వం చెబుతున్న మిశ్రా కమిషన్ లెక్క, 50 సీలింగ్ కారణం అని అధికారులు చెబుతున్నారు. కానీ మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడం వల్లే ఈ అన్యాయం జరిగిందని బీసీ నేతలు మండిపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారం ఇచ్చిన తర్వాత మిగిలిన దానిలోనే బీసీలను కుక్కేశారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపిస్తున్నారు. తొట్టంబేడు మండలంలో బీసీ జనాభా 45 శాతానికి పైగా ఉంది. అయినా వారికి ఒక్క స్థానం ఇవ్వడం అంటే బీసీ ఓట్లు మాత్రమే కావాలి, పదవులు వద్దా అని ప్రశ్నిస్తున్నారు. ఇది ఒక్క తొట్టంబేడు సమస్య కాదు, రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన ప్రశ్న. ఉన్నతాధికారులు స్పందించకపోతే ఎన్నికల్లోనే ప్రభావం పడుతుందని నాయకులు హెచ్చరిస్తున్నారు.

## తొట్టంబేడులో వైసీపీ ఎన్నికల శంఖారావం

తొట్టంబేడు,అక్టోబర్ 16 ప్రభాతవార్త:



స్థానిక సంస్థల ఎన్నికల్లో తొట్టంబేడు మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నారు.శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తొట్టంబేడు మండలానికి చెందిన ప్రతి పంచాయతీ నాయకులతో ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం కేవలం మామూలు సమావేశం కాదు, ఎన్నికలకు సన్నద్ధం చేసే యుద్ధ తంత్రం అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి పంచాయతీ నుంచి కనీసం 5 మంది కీలక నాయకులను రప్పించి, గ్రామ స్థాయిలో బలాబలాలు, అభ్యర్థుల ఎంపిక, ప్రత్యర్థుల వ్యూహాలపై నేరుగా చర్చించనున్నారు. గత కొన్ని రోజులుగా మండలంలో పర్యటిస్తున్న మధుసూదన్‌రెడ్డి, వైకాపా మండల ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు క్షేత్రస్థాయిలో నాయకుల అభిప్రాయాలను సేకరిస్తూ, విభేదాలు ఉంటే వాటిని సరిదిద్దే పనిలో ఉన్నారు. గ్రామాల్లో పార్టీ క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చి, ఒక్కో సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ సమావేశంలో అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ నేతలు అంటున్నారు. పంచాయతీ వారీగా బూత్ కమిటీలు, ప్రచార వ్యూహం, బాధ్యతల విభజనపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు.తొట్టంబేడు మండలంలోని ప్రతి పంచాయతీ నాయకులు ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఉన్న వాసుదేవ నాయుడు పిలుపునిచ్చారు.

## వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించాలి : మణినాయుడు

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

స్థానిక సంస్థ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని వైఎస్ఆర్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కె. మణి నాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో అభ్యర్థుల ఎన్నికలపై అభిప్రాయాలను సేకరించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అభ్యర్థులను గెలిపించుకోవడం అందరి బాధ్యతని, విభేదాలను విస్మరించి కలిసికట్టుగా పనిచేసి వైఎస్ఆర్‌సీపీ అన్ని స్థానాల్లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు.

**–జడ్పీటీసీ అభ్యర్థిగా మానికల వెంకటమ్మ:**

వైఎస్ఆర్‌సీపీ పార్టీ తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా మాణికుల వెంకటమ్మను ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు మండల పార్టీ అధ్యక్షులు కె. మణి నాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని కంపాలెం గ్రామం సమీపంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభిప్రాయాలను సేకరించి జడ్పీటీసీ అభ్యర్థిగా వెంకటమ్మ పేరును ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ వైఎస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధికార తెదేపాలో కౌన్సిలర్ సీట్లకు గట్టి పోటీ

కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన కుప్పం మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసేందుకు పార్టీ నేతలు అధిక సంఖ్యలో కౌన్సిలర్ సీటును ఆశిస్తున్నారు. దీంతో పార్టీ ముఖ్య నేతలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తులు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో 32 వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో సగభాగం మహిళలకు రిజర్వు అయ్యాయి. ఈ వార్డులతో పాటు మిగతా వార్డులకు సైతం పార్టీ నేతలు తమకో లేక తమ కుటుంబీకులకో కౌన్సిలర్ సీటు ఇవ్వాలని ముఖ్య నేతల వద్ద ప్రస్తావిస్తున్నారు. ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు వంటి కీలక నేతలతో పాటు సిఎం పిఎ శ్రీకాంత్‌లు అభ్యర్థుల ఎంపికపై నేరుగా పార్టీ తరపున టికెట్ ఆశిస్తున్న ఆశావహులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. ఇంకా పలువార్డుల్లో అభ్యర్థులు ఎవరనేది కొలిక్కి రాలేదని సమాచారం. దీంతో టికెట్ ఆశిస్తున్న వారు తమకే టికెట్ లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు లేదా వారి కుటుంబీకులను ఈ దఫా కౌన్సిలర్ స్థానాల్లో నిలిపేందుకు కసరత్తులు జరుగుతున్నాయని సమాచారం. వైకాపాలోను అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రాలేదని సమాచారం. ఎటొచ్చీ రేపు ఆదివారం మధ్యాహ్నం 3గంటల కల్లా నామినేషన్ల దాఖలుకు గడువు ఉన్న నేపథ్యంలో ఆయా పార్టీల్లో కౌన్సిలర్ స్థానాలకు ఎవరెవరు నామినేషన్లు దాఖలు చేస్తారో అనే ఉత్కంఠ ఆయా పార్టీ శ్రేణుల్లో నెలకొంది.

# తిరుపతి డివిజన్

## చైర్మన్ అభ్యర్థిగా అమ్ములు నామినేషన్ దాఖలు

పుత్తూరు, అక్టోబరు 16 ప్రభాతవార్త :



స్థానిక సంస్థ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా డి.ఎన్.ఏలుమలై (అమ్ములు) శుక్రవారం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వద్ద తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఒకటి, జనసేన అభ్యర్థిగా రెండో నామినేషన్ దాఖలు చేశారు. పుత్తూరు మునిసిపల్ చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించడం వల్ల తొలుత టిడిపి అభ్యర్థిగా రంగంలోకి దిగాలనుకున్న అమ్ములు, జనసేన తరపున కూడా నామినేషన్ దాఖలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## దుర్గమ్మకు సారె అందించిన శాసనసభ్యుడు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 16 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కనకాచలంపై వెలసిన కనక దుర్గమ్మకు శుక్రవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దంపతులు మొక్కును తీర్చుకొనుటకు సారె అందించారు. సుధీర్‌రెడ్డి ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డిలు సారెను పిట్టలవారి సందు మెట్లపై నుంచి కొండపైకి చేరుకున్నారు.అక్కడ అమ్మవారికి సారెను సమర్పించారు.కొండపైకి నడచి వచ్చు భక్తుల సదుపాయాలను ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా దేవస్థానం ఇంజనీరింగ్ సిబ్బందికి వర్షం కురుస్తున్నందువల్ల వచ్చే మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకకుండా సదుపాయాలు కల్పించాలన్నారు ఇక క్యూలైన్లలో ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇక మంచినీటి సదుపాయంతో పాటు ఇక్కడ మొక్కులు తీర్చుకొనుటకు మహిళా భక్తులు అధిక సంఖ్యలో కనబడుతున్నారు.దసరా ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మహిళా భక్తులుబారులు తీరారు. ఆలయం వద్ద మొక్కులు తీర్చుకొనుటకు పొంగళ్ళు పెట్టారు. దీపాలతో నివేదన చేసారు.అమ్మవారికి సరస్వతి అలంకారం జరిపారు.

## ముస్లిం విధానాలకు సంబంధించి గురువులతో తెలుసుకోండి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:



ఇస్లాం మత సిద్ధాంతాలకు సంబంధించి ఎవరికి వారు ఎవరి పరిధిలో ఎవరికి తోచినట్లు వారు కాకుండా గురువులతో సంప్రదించాలని దివ్యఖుర్ఆన్, ప్రవక్తలు ఉల్లేఖనాలను తెలుసుకోవాలని హాఫీజే ఖుర్ రేహాన్ అన్నారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారు.ఈ వాస్తవాన్ని తెలుసుకోవాలని, మనం మన పలుకును కంట్రోల్‌లో పెట్టుకోవాలన్నారు. మౌనం ఎన్నో సమస్యలు పరిష్కారానికి అవకాశం అన్నారు. కానీ నేడు మనం ఎంత జవాబుదారి తనంతో ఉన్నామనేది కాకుండా ఎదుటి వారిని దూషించటం పరిపాటి అయ్యిందన్నారు. ముస్లిం మత సంబంధమైన అంశాలకు సంబంధించి మత గురువులతో వాస్తవ విషయాలకు సంబంధించి తెలుసుకోవాలన్నారు. మనం ఏకాగ్రతతో ప్రార్థనలు జరిపి అల్లాహ్‌కుదగ్గర కావాలని సూచించారు.

## పొదుపు సంఘాల సారధ్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 16 ప్రభాతవార్త:




శ్రీకాళహస్తిలోని రాస్ సారధ్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా మహిళా సంఘాల సారధ్యంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాస్ ప్రదాన కార్యదర్శి ఎస్ వెంకటరత్నం ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు సూచనలతో రాస్‌మహిళా వాణి శ్రీకాళహస్తి బ్రాంచ్ సారధ్యంలో తొండమనాడు క్లస్టర్ పరిధిలోని రామలింగాపురంలో వెలసిన పుట్టాలమ్మ అమ్మవారి ఆలయంలో దసరా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొండవాడ పరిసర ప్రాంతాలకు చెందిన రాస్ మహిళా పొదుపు సంఘాల సభ్యులు సంప్రదాయబద్ధంగా అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారుఈ సందర్భంగా అన్నదానం జరిపారు.ఈ కార్యక్రమాల్లో ప్రాజెక్టు ఆఫీసర్ కరుణాకర్‌నాయుడు, వినోద్,ముఖేష్, జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడు మండలంలో తేలని పంచాయతీ!

ఏర్పేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలాల ఎంపిటిసిలకు సంబందించి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆ మండల నాయకులతో చర్చించి ఖరారు చేసారు.అయితే ఏర్పేడు మండలానికి సంబంధించి చర్చలు ఓ కొలిక్కి రాలేదు. జడ్‌పిటిసిగా హేమాక్షి సతీమణి పూల మునిరాజ పేరు ఖరారు చేసారు. మండలాధ్యక్షపదవికి సంబంధించి మండలంలో ఒరెండు సమాజిక వర్గాలు పట్టుబట్టడంతో సమస్య అడకత్తెరలో పోక వలే మారింది.ఈ మండలంలో ప్రధాన వర్గాలుగా వన్నెకుల క్షత్రియులు, యాదవులు ఉన్నారు. మరో వైపు ఈ సారి పాపానాయుడుపేటలోని రెండు సామాజిక వర్గాలు రంగంలో దిగినట్లు సమాచారం. మండలాధ్యక్షుడుగా ఎవరు ఉండాలనే అంశంపై ఏకాభిప్రాయానికి రాలేదు. దాంతో ఈ పంచాయతీ తేలలేదు. వన్నెకుల క్షేత్రియులు అత్యధిక శాతం ఉన్నారు. వారు మండలాధ్యక్షపదవి కావాలని పట్టుబట్టారు.వారికి దీటుగా యాదవులున్నారు. వారు కూడా తమకే మండలాధ్యక్ష పదవి కావాలని ఉన్నారు.ఈ మండలం ఈసారి బిసిలకు కేటాయించటంతో నాయకులకు సమస్యగా మారింది.గతంలో ఏర్పేడు మండలాధ్యక్షపదవి తెలుగుదేశం హయాంలో గిరిజనులకు కేటాయిం చారు. వైకాపా పాలనలో ఎస్‌సి మహిళ చేసారు.ఈ సారి బిసి చేయటంతో కూటమిలో సర్దుబాటు కుదరటం లేదు. ఇరువర్గాలు పట్టువిడుపు లేకుండా వ్యవహారించటంతో జడ్‌పిటిసిని ఖరారు చేసి మండలాధ్యక్ష పదవిపై సామరస్యంగా సర్దుకోవాలని నాయకుడు సూచిస్తున్నా దారికి రావటం లేదని తెలిసింది. వన్నెకుల క్షత్రియుల నుంచి మునిరెడ్డి, హరి,(పెట్రోల్ బంకు) యాదవుల్లో గుణాయాదవ్ సతీమణిని అవకాశం కావాలని కోరుతున్నారు. మండలంలో గురువారెడ్డి,నాగరాజు నాయుడు వర్గాలు పట్టుబట్టారు.దాంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

## సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారు

ఏర్పేడు,అక్టోబర్ 16 ప్రభాతవార్త:



మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయంలో దసరా సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దసరా సందర్భంగా ఆలయ చైర్మెన్ బత్తలగిరి నాయుడు ఇఓ మునిశేఖర్‌లు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.వచ్చిన భక్తులకు ఇబ్బందిలేకుండా సదుపాయాలతో పాటు మధ్యాహ్నం భోజన సదుపాయం కూడ కల్పించారు. శుక్రవారం ఆలయానికి మహిళా భక్తుల సంఖ్య అధికంగా వచ్చారు. అమ్మవారికి సరస్వతి దేవీ అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి జాకెట్‌లు, గాజులు పసుపు కుంకుమ సమర్పించారు.